సంపుటి : 9
సంచిక : 281
శనివారం
04 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999



### మొన్న మావిగన్, నిన్న విజయవాడ..

# రేపు ఏమంటారో!

- కడప జిల్లా జమ్మలమడుగులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం
- మొత్తం రూ.36,700 కోట్లతో గ్రీన్ స్టీల్ ప్లాంట్.. 24 నెలల్లో పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంలో రెండుసార్లు మోసపూరిత శంకుస్థాపనలు జరిగాయని ఆరోపణ
- రాయలసీమను పారిశ్రామిక, హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని స్పష్టం చేసిన సీఎం

**జగన్‌కు సీఎం చంద్రబాబు చురక**

**జమ్మలమడుగు, విశ్వం వాయిస్ న్యూస్ :** "అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా ఒప్పుకొని, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల నాటకమాడి, అధికారం పోయాక నిన్న విజయవాడ, నేడు 'మావిగన్' అంటూ మాట్లాడుతున్నారు. ఇది మతిస్థిమితం లేని రాజకీయానికి నిదర్శనం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు... వైసీపీ అధినేత జగన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆత్మాభిమానంతో ముడిపడిన రాజధాని వంటి సున్నితమైన అంశంపై బాధ్యతారహితంగా మాట్లాడటం దారుణమని అన్నారు. మొన్న మావిగన్ అన్నారు, నిన్న విజయవాడ అంటున్నారు... రేపు ఏమంటారో అంటూ చంద్రబాబు విమర్శించారు. ఇలాంటి మతిస్థిమితం లేని మాటలు, రాజకీయాలను తన జీవితంలో మొదటిసారి చూస్తున్నానని అన్నారు. తాము విశ్వసనీయతతో కూడిన రాజకీయం చేస్తామని, ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు రాజధానిపై గందరగోళం సృష్టిస్తుంటే, తాము మాత్రం రాయలసీమ ప్రజల దశాబ్దాల కలను నిజం చేస్తూ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించి చేసి చూపిస్తున్నామని అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో, రాయలసీమ ప్రజల చిరకాల వాంఛ అయిన జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

**సరిగ్గా 24 నెలల్లో పూర్తి చేస్తాం**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 2019, 2023 సంవత్సరాల్లో రెండుసార్లు ఇదే స్టీల్ ప్లాంట్‌కు మోసపూరిత శంకుస్థాపనలు చేశారని, కనీసం తట్ట మట్టి కూడా తీయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని అడ్డంకులను తొలగించి, పనులను ప్రారంభించామని తెలిపారు. "ఈరోజు జూలై 3వ తేదీ. ఈ డేట్ రాసి పెట్టుకోండి. సరిగ్గా 24 నెలల్లో, అంటే 2026 జూలై 3వ తేదీ నాటికి ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇది మా ప్రభుత్వ నిబద్ధత" అని చంద్రబాబు మిగతా .. 2లో..

### విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో

# డిప్యూటీ సీఎం పవన్ భేటీ

- వివిధ అంశాలపై గవర్నర్‌తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్
- అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ
- సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్‌కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు మిగతా .. 2లో..

## సీఎం విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే అరెస్ట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎమ్మెల్యే అనితా ఆర్.రాధాకృష్ణన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన చేసిన అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చడంతో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జూన్ 20న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

### భావప్రకటన స్వేచ్ఛ అంటే

## బూతుల లైసెన్స్ కాదు

**హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదన్న మంత్రి కందుల దుర్గేష్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** "సోషల్ మీడియాలో భావప్రకటన స్వేచ్ఛ ఉంది కదా అని హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు.. అది బూతులు తిట్టడానికి ఇచ్చిన లైసెన్స్ కాదు" అని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను దుర్వినియోగం చేస్తూ సమాజ వాతావరణాన్ని పాడుచేసే వారిపై చట్టం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని మిగతా .. 2లో..

## పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

**ప్రశ్న రావణ్‌ను అప్పగించాలంటూ జనసైనికుల ఆందోళన**



**ఇనగుదురు, విశ్వం వాయిస్ న్యూస్ :** డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలతో అరెస్టయిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్) విషయంలో కృష్ణా జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం జిల్లాలోని ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో ఉన్న రావణ్‌పై దాడి చేసేందుకు జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళం ఏర్పడింది. పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టిన జనసైనికులను అదుపు చేయడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. స్టేషన్ చుట్టూ భద్రతా వలయం ఏర్పాటు చేసినప్పటికీ, కొందరు కార్యకర్తలు పోలీసులను తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు జనసైనికులు గోడ దూకి పోలీస్ స్టేషన్ ఆవరణలోకి ప్రవేశించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బయటకు పంపించారు. అంతకుముందు కాకినాడ జిల్లా కోర్టుల్లో రెండు మిగతా .. 2లో..

### పాపికొండలు విహారయాత్రకు

## పచ్చజెండా

**20 రోజుల తర్వాత పునఃప్రారంభం**



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాపికొండలు విహారయాత్రకు అధికారులు పచ్చజెండా ఊపారు. ఇరవై రోజుల తరువాత శనివారం నుంచి విహార యాత్రను పునరుద్ధరిస్తూ అనుమతులు మంజూరు చేశారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో గండిపోశమ్మ ఆలయం నుంచి బయలుదేరేందుకు మిగతా .. 2లో..

### రూ.450 కోట్ల రుషికొండ భవనాల వినియోగంపై

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**భవనాలను లీజుకు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం**




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలో నిర్మించిన వివాదాస్పద రుషికొండ పర్యాటక భవనాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.450 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన ఈ ప్యాలెస్ లాంటి భవనాలను 'ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్' ప్రాతిపదికన లీజుకు ఇవ్వాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని నిర్వహించేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' కోరుతూ అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజకీయ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా గత రెండేళ్లుగా ఈ భవనాలు ఎలాంటి వినియోగం మిగతా .. 2లో..

### అమరావతి

## ఓ భారీ అవినీతి యజ్ఞం

**త్వరలోనే కోర్టుకు వెళతా : విజయసాయి రెడ్డి**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి తీవ్రమైన ఆరోపణలతో ముందుకొచ్చారు. టీడీపీ 'అమరావతి' అంటుంటే, వైసీపీ 'మావిగన్' అనడం వంటి అర్థరహిత వాదనలను పక్కనపెట్టి, రాజధాని పేరుతో జరుగుతున్న భారీ అవినీతిపై దృష్టి సారించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అమరావతి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,000 కోట్ల అవినీతికి పథకం రచించారని, ఈ అవినీతి యజ్ఞంపై పూర్తి ఆధారాలతో మిగతా .. 2లో..

### ఏపీ హైకోర్టుకు

## ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం**
**మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం - కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల మిగతా .. 2లో..

# మాయా 'గల్ఫ్' ముఠా.. అమాయక మహిళలపై నకిలీ 'వీసా' పంజా!




- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తూ.గో. జిల్లాకు చెందిన 20 మంది మహిళలు అదుపు
- ఒమన్ ఎయిర్‌వేస్‌లో మస్కట్ వెళ్లేందుకు యత్నం.. బోర్డింగ్ తనిఖీల్లో గుట్టురట్టు చేసిన ఇమ్మిగ్రేషన్ అధికారులు
- లక్షలు పోసి, అప్పుల పాలై.. ఏజెంట్ల చేతిలో మోసపోయామంటూ బాధితుల కన్నీరు

**కాకినాడ, విశ్వం వాయిస్ బ్యూరో రిపోర్ట్:**
పేదరికం.. కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలనే ఆశ.. విదేశాల్లో మంచి జీతం వస్తుందనే నమ్మకం - ఇవన్నీ ఆసరాగా చేసుకుని గల్ఫ్ ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేసే ఏజెంట్ల దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. మస్కట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి, నకిలీ వీసాలు, అనుమానాస్పద పత్రాలతో మహిళలను విదేశాలకు పంపేందుకు ప్రయత్నించిన వ్యవహారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 20 మంది మహిళలు ఒమన్ రాజధాని మస్కట్‌కు వెళ్లేందుకు ఒమన్ ఎయిర్‌వేస్ విమాన టికెట్లతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. లగేజ్ చెకింగ్ అనంతరం ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద పత్రాల పరిశీలన జరుగుతుండగా, అధికారులకు వారి వీసాలు, ఉద్యోగ సంబంధిత పత్రాలపై అనుమానం వచ్చినట్లు తెలిసింది.

**బోర్డింగ్ దగ్గరే అసలు గుట్టు బయటపడింది!**

వీసా పత్రాలు, నియామక మిగతా .. 2లో..

**అలర్ట్: విదేశాలకు వెళ్లేవారు ఇవి తప్పక సరిచూసుకోండి**

- గవర్నమెంట్ రిజిస్టర్డ్ ఏజెంట్లనే నమ్మండి
- వీసా నంబర్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోండి
- టూరిస్ట్/విజిట్ వీసాపై ఉద్యోగానికి వెళ్లొద్దు
- ఉద్యోగ ఒప్పంద పత్రం, జీతం వివరాలు స్పష్టంగా చూసుకోండి
- అనుమానం ఉంటే వెంటనే అధికారులను సంప్రదించండి

**విదేశీ ఉద్యోగాల విషయంలో అప్రమత్తతే రక్షణ**

(మొదటిపేజీ తరువాయి)

# మొన్న మావిగన్, నిన్న విజయవాడ... రేపు ఏమంటారో!

సభాముఖంగా హామీ ఇచ్చారు.

**రూ.36,700 కోట్ల పెట్టుబడి.. గ్రీన్ స్టీల్ ప్రత్యేకత**

ఈ ప్రాజెక్టు వివరాలను వెల్లడిస్తూ, మొత్తం రూ.36,700 కోట్ల పెట్టుబడితో ఈ కర్మాగారం రూపుదిద్దుకోనుందని తెలిపారు. మొదటి దశలో రూ.4,500 కోట్లు, రెండో దశలో రూ.11,850 కోట్లు ఉక్కు కర్మాగారంపై వెచ్చించనుండగా, ప్లాంట్‌కు అవసరమైన సౌర విద్యుత్ కోసం మరో రూ.20,350 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నారని వివరించారు. ఈ ప్లాంట్ ద్వారా రెండు దశల్లో 2 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి జరుగుతుందని అన్నారు. దేశంలోనే తొలిసారిగా పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో 'గ్రీన్ స్టీల్' ఉత్పత్తి చేసే కర్మాగారం మన రాయలసీమలో రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 1100 ఎకరాల భూమిని కేటాయించిందని, గండికోట జలాశయం నుంచి 2 టీఎంసీల నీటిని, జాతీయ రహదారి, రైల్వే లైన్ కనెక్టివిటీని కల్పిస్తున్నామని తెలిపారు.

**రాయలసీమ రాత మార్చే బాధ్యత నాది**

"రాయలసీమను రాళ్ల సీమగా కానివ్వను, రత్నాల సీమగా మార్చి చూపిస్తా" అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్‌తో ఈ ప్రాంతం ఉక్కుకు కేంద్రంగా మారుతుందని, విశాఖతో పాటు రాయలసీమ కూడా ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కేవలం స్టీల్ ప్లాంటే కాకుండా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్పేస్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, గోల్డ్ మైనింగ్ వంటి అనేక పరిశ్రమలతో ఈ ప్రాంత ముఖచిత్రాన్నే మార్చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రపంచానికే ఆదర్శంగా రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను ఆగస్టు 15లోగా మదనపల్లిలో ప్రారంభిస్తామని ప్రకటించారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఆంత్రప్రెన్యూర్' లక్ష్యంతో యువతకు, రైతులకు అవసరమైన శిక్షణ, రుణాలు అందించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. బళ్లారిలోని జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ కంటే పెద్ద యూనిట్‌గా రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని సజ్జన్ జిందాల్‌ను కోరినట్లు చంద్రబాబు వెల్లడించారు.

**ఆడవాళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు!**

రాష్ట్రంలో పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు అత్యంత ముఖ్యమని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లతో రౌడీయిజం పెరిగిపోయిందని, పోలీసులపై దాడులు జరిగాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, మహిళల జోలికి వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వివేకా హత్య కేసును ప్రస్తావిస్తూ, హింసతో, నేరాలతో చేసే రాజకీయాలు ప్రజలకు మంచి చేయవని, అలాంటి వాటికి చరమగీతం పాడతామని అన్నారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్టుతో రాయలసీమ పారిశ్రామికీకరణ ఇక ఆగదని, ఈ ప్రాంతాన్ని దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే వరకు విశ్రమించబోమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# మాయా 'గల్ఫ్' ముఠా..

పత్రాలను నిశితంగా పరిశీలించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు వాటి ప్రామాణికతపై అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో విదేశీ ప్రయాణం తాత్కాలికంగా నిలిపివేసి, ఆ 20 మంది మహిళలను తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టుకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అసలు ఏజెంట్లు ఎవరు? మహిళల నుంచి ఎంత మొత్తం వసూలు చేశారు? వారికి ఇచ్చిన వీసాలు నిజంగా నకిలీవేనా? అనే అంశాలపై విచారణ కొనసాగాల్సి ఉంది.

**"ఇల్లు తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చాం"**

విచారణలో బాధిత మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. "మస్కట్‌లో మంచి ఇళ్లలో పని ఇప్పిస్తాం.. నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం వస్తుంది" అని ఏజెంట్లు నమ్మించడంతో, కొందరు ఇళ్లు తాకట్టు పెట్టి, మరికొందరు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి లక్షల రూపాయలు చెల్లించినట్లు బాధితులు వాపోయినట్లు తెలిసింది. ఎయిర్‌పోర్టుకు వచ్చిన తర్వాతే తమ పత్రాలపై అనుమానం వచ్చిందని, ఇప్పుడు డబ్బులు పోయి, కేసుల భయంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

**ఎడిటర్ అనాలిసిస్: 'విజిట్ వీసా' ముసుగులో గల్ఫ్ మోసం**

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల్లో ప్రధానంగా కనిపిస్తున్న అంశం – ఉద్యోగ వీసా బదులు విజిట్ వీసా లేదా టూరిస్ట్ వీసాపై పంపించే ప్రయత్నం. విదేశాలకు వెళ్లిన తర్వాత పని వీసాగా మారుస్తామని చెప్పడం, భారీ జీతాలు వస్తాయని నమ్మించడం, పాస్‌పోర్టులు దగ్గర పెట్టుకోవడం వంటి పద్ధతులతో అమాయకులను ఉచ్చులోకి లాగుతున్న నకిలీ ఏజెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్నారు. విజిట్ వీసాపై వెళ్లి అక్కడ ఉద్యోగం చేయడం చట్టపరంగా ప్రమాదకరం. అలాంటి పరిస్థితుల్లో మహిళలు విదేశీ గడ్డపై అక్రమ వలసదారులుగా మారే ప్రమాదం ఉంది. జీతం రాకపోవడం, పాస్‌పోర్ట్ స్వాధీనం, పని ఒత్తిడి, వేధింపులు, న్యాయ సహాయం దొరకకపోవడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

**ప్రజలకు అలర్ట్: విదేశీ ఉద్యోగాలకు వెళ్లే ముందు ఇవి తప్పక సరిచూసుకోండి**

1. రిజిస్టర్డ్ ఏజెంట్లనే నమ్మండి

విదేశీ ఉద్యోగాల కోసం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని వవీఅస్త్రతీఖ్వ పోర్టల్‌లో నమోదైన రిక్రూటింగ్ ఏజెంట్ల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. లైసెన్స్ లేని సబ్-ఏజెంట్లు, మధ్యవర్తులను నమ్మకూడదు.

2. వీసా నిజమా కాదా చెక్ చేసుకోండి

ఏజెంట్ ఇచ్చిన వీసా నంబర్‌ను సంబంధిత దేశం అధికారిక వీసా వెబ్‌సైట్ లేదా ఎంబసీ ద్వారా తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి.

3. టూరిస్ట్/విజిట్ వీసాపై ఉద్యోగానికి వెళ్లొద్దు

"ముందు విజిట్ వీసాపై వెళ్ళండి.. అక్కడికి వెళ్లాక వర్క్ వీసాగా మార్చేస్తాం" అని ఎవరైనా చెబితే అప్రమత్తంగా ఉండాలి.

4. ఉద్యోగ ఒప్పంద పత్రం తీసుకోండి

జీతం, పని గంటలు, వసతి, ఆహారం, ఇన్సూరెన్స్, యజమాని వివరాలు స్పష్టంగా ఉన్న ఒప్పంద పత్రం లేకుండా వెళ్లకూడదు.

5. అనుమానం ఉంటే వెంటనే ఫిర్యాదు చేయండి

ఏజెంట్లు మోసం చేస్తున్నట్లు అనిపించినా, వీసాపై అనుమానం ఉన్నా స్థానిక పోలీస్ స్టేషన్, జిల్లా ఎస్పీ కార్యాలయం లేదా సంబంధిత ప్రభుత్వ సహాయ కేంద్రాలను సంప్రదించాలి.

**విశ్వం వాయిస్ ప్రజలకు విజ్ఞప్తి**

గల్ఫ్ ఉద్యోగం పేరుతో భారీ జీతాల కలలు చూపిస్తూ డబ్బులు అడిగే ఏజెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విదేశీ ఉద్యోగం అనేది కుటుంబ భవిష్యత్తును మార్చగల అవకాశం కావచ్చు. కానీ సరైన పత్రాలు, ప్రభుత్వ గుర్తింపు, చట్టబద్ధమైన మార్గం లేకపోతే అదే అవకాశం జీవితాన్ని కష్టాల్లోకి నెట్టే ప్రమాదంగా మారుతుంది.

**విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో**

# డిప్యూటీ సీఎం పవన్ భేటీ

కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

# సీఎం విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే అరెస్ట్

ఎం.కరుణానిధి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌పై రాధాకృష్ణన్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమ నుంచి ఆయన రాజకీయ అరంగేట్రాన్ని ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడటంతో పాటు ఓ నటి ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆయనపై కేసు నమోదైంది. తాజాగా హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో పోలీసులు సదరు ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. ఈ అరెస్టును డీఎంకే ఎంపీ కనిమొళి ఖండించారు. ప్రతిపక్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు.

**భావప్రకటన స్వేచ్ఛ అంటే**

# బూతుల లైసెన్స్ కాదు

స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో కొందరు కావాలనే పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే, తద్వారా కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చనే కుట్రపూరిత వ్యూహంతో వైసీపీ సోషల్ మీడియా వింగ్ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం తమ యూట్యూబ్ ఛానళ్లు, పేజీల వ్యూస్ పెంచుకోవడం కోసం డిప్యూటీ సీఎం పేరును వాడుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, కానీ హద్దులు దాటి వ్యక్తిత్వ హననానికి పాల్పడే హక్కు ఎవరికీ లేదని, అందుకే సోషల్ మీడియాపై తగిన నియంత్రణ అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో విశాఖపట్నంలోని వివాదాస్పద రుషికొండ ప్యాలెస్ భవిష్యత్తు వినియోగంపైనా కందుల దుర్గేశ్ కీలక వివరాలు వెల్లడించారు. రుషికొండ భవనాలను పర్యాటకాభివృద్ధికి, అలాగే ప్రజల సందర్శన కోసం వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దీని నిర్వహణను చేపట్టేందుకు ఇప్పటికే 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్'ను ఆహ్వానించినట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ తుగ్లక్ విధానాల కారణంగా రాష్ట్ర పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ. 7 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మంత్రి మండిపడ్డారు. ఇకపై ఆ నష్టాల నుంచి పర్యాటక రంగాన్ని గట్టెక్కించి, రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**అమరావతి**

# ఓ భారీ అవినీతి యజ్ఞం

త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తానని ఆయన సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను పంచుకుంటున్నానంటూ విజయసాయి రెడ్డి పలు కీలక ప్రశ్నలను సంధించారు. "రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా రాజధాని ఎక్కడో తేల్చకుండా చర్చించడం అందరూ సిగ్గుపడాల్సిన విషయం కాదా? 2029 ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయించాలా? ఈ రాజకీయ చదరంగానికి అన్ని పార్టీలు బాధ్యత వహించవద్దా?" అని ఆయన నిలదీశారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను ఎందుకు పక్కనపెట్టారని ఆయన ప్రశ్నించారు. అమరావతి నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని ఆయన వివరంగా ఆరోపించారు. "ప్రస్తుత ప్రభుత్వం రాజధాని నిర్మాణం కోసం రూ.50,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నిర్మాణంలోనూ అంచనాలను భారీగా పెంచి చూపారు. ఇది 'దేవతల నగరం' అనే బ్రాండింగ్‌తో సాగుతున్న అతిపెద్ద అవినీతి పథకం. అధికారంలో ఉన్నవారు 25 నుంచి 30 శాతం వరకు కమీషన్లుగా దండుకుంటున్నారు. అంటే ఇది సుమారు రూ.15,000 కోట్ల లంచాల స్కామ్. అసలు అమరేశ్వర ఆలయం, బుద్ధుని విగ్రహం ఉన్న ప్రాంతానికి, ఇప్పుడు భవనాలు కడుతున్న ప్రాంతానికి 50 కిలోమీటర్ల దూరం ఉంది. ఆ అమరావతి పుణ్యక్షేత్రం అయితే, ఈ అమరావతి అవినీతి ప్రవహించే క్షేత్రం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. మొదటి దశ భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ ప్లాట్లు కేటాయించకపోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజధాని కోసం లక్ష ఎకరాలతో ఏం చేస్తారని నిలదీశారు. విభజన చట్టంలోనే వీజీటీఎం (విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి) అభివృద్ధి ప్రస్తావన ఉన్నప్పుడు, ఆ ప్రాంతమంతా రాజధాని భవనాలను విస్తరిస్తే నష్టమేమిటని ఆయన సూచించారు. వైసీపీ 'మావిగన్' అనడం వల్ల ప్రయోజనమేంటని, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల గతేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటే పార్టీలు కమీషన్లు దండుకోవడం కాదని హితవు పలికారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఈ అవినీతిపై ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో, ప్రజాపక్షాన త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

**ఏపీ హైకోర్టుకు**

# ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

# పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

వేర్వేరు కేసుల్లో బెయిల్ పొందిన రావణ్‌ను, ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అరెస్ట్ చేసి ఇక్కడికి తరలించారు. గురువారం కూడా కాకినాడ జిల్లా సర్పవరం పోలీస్ స్టేషన్ వద్ద ఇలాంటి వాతావరణమే కనిపించింది. రావణ్‌ను తమకు అప్పగించాలంటూ జనసైనికులు ఆందోళన చేయడమే కాకుండా, అతడిని తరలిస్తున్న వాహనంపై కోడిగుడ్లు విసిరారు. జూన్ 28న ఏలూరులో జరిగిన ఓ సమావేశంలో పవన్ కల్యాణ్‌పై వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో పిఠాపురం పోలీసులు తొలుత రావణ్‌ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఆ కేసులో బెయిల్ రాగానే సర్పవరం పోలీసులు, అక్కడ బెయిల్ రాగానే ఇనగుదురు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి కేసులు నమోదు చేసి, అరెస్టులు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

# పాపికొండలు విహారయాత్రకు పచ్చజెండా

15 ప్రైవేట్ బోట్లు, ఒక ఏపీటీడీసీ బోటు సిద్ధమయ్యాయి. గత నెల 14న పోశమ్మగండి నుంచి గోదావరిలో విహారయాత్రకు బయలుదేరిన ఓ పర్యాటక బోటు దేవీపట్నం పోలీసు స్టేషన్ సమీపంలోకి వెళ్లేసరికి సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అప్పట్లో రంపచోడవరం ఆర్డీవో స్వాతి, ఇటీవల జేసీ ప్రశాంత్‌కుమార్ బోట్లను తనిఖీ చేశారు. శనివారం నుంచి బోట్లు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేశారని జలవనరుల శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

లేకుండా ఖాళీగా పడి ఉన్నాయి. ఫలితంగా ఇవి క్రమంగా దెబ్బతింటున్నాయని, పైగా వీటి భద్రత, నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెల దాదాపు రూ.25 లక్షల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయాల్సి వస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రుషికొండ భవనాలపై అధ్యయనం చేసిన మంత్రివర్గ ఉపసంఘం... వీటిని ఒక లగ్జరీ రిసార్ట్‌గా మార్చితే పర్యాటక రంగానికి లాభసాటిగా ఉంటుందని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగానే లీజు ప్రక్రియ మొదలైంది. అయితే, ఈ లగ్జరీ రిసార్ట్ ప్రాజెక్టును దక్కించుకునేందుకు ఆసక్తి చూపుతున్న పలువురు బడా పెట్టుబడిదారులు... ప్రస్తుతం ఉన్న భవనాలకు అదనంగా మరికొన్ని కొత్త నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కానీ, రుషికొండపై జరిగిన నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు ఉండటం, జాతీయ హరిత ట్రైబ్యునల్ తో పాటు కోర్టుల్లో కేసులు నడుస్తుండటంతో... అదనపు అనుమతుల అంశంపై ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది.

# గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

**కుప్పంలో సీఎం చంద్రబాబు భావోద్వేగం - కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన**

**అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం - శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు**

**కుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ :** "గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

**పెట్టుబడుల కుంభవృష్టి.. ఉద్యోగాల జాతర**

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది. దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏవియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్



లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది. వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**శంకుస్థాపన రోజే ప్రారంభ తేదీలు**

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

**కుప్పం నా బాధ్యత.. అభివృద్ధి నా ఆశయం**

ఈ సభలో ప్రసంగించిన చంద్రబాబు, కుప్పం ప్రజలు తనను 8వ సారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి దీవెనలే తనకు శ్రీరామరక్ష అని అన్నారు. "నేను ఎక్కడున్నా నా ఆలోచనలు కుప్పం మీదే ఉంటాయి. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయాలన్నది నా కోరిక. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి, అందులో కుప్పం ముందుండాలి," అని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారి తోకలు కత్తిరిస్తానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలతో పాటు, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, బీసీ, ఓసీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు, పరిశ్రమల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ వంటి పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## వైసీపీలో రీ జాయినింగ్స్ కమిటీ?


జనసేన ఈ మధ్యనే జాయినింగ్ కమిటీని ఒక దానిని ఏర్పాటు చేసింది. నిజానికి ఇలాంటి కమిటి ఒకటి ఉండాలని కూడా ఎవరికీ తోచని నేపథ్యంలో జనసేన ఈ ప్రయోగం చేసింది. నిజానికి ఎవరి పార్టీ వారి ఇష్టం. ఏ రకమైన కమిటీలు అయినా వేసుకోవచ్చు. అందువల్ల జనసేన తమ పార్టీని సంస్థాగతంగా బాగా పటిష్టం చేసుకోవడానికి ఈ నిర్ణయం తీసుకుంది. మరి జాయినింగ్స్ కమిటీ పని ప్రరంభించిందా అది ఎంతవరకూ వచ్చింది అన్నది అయితే ఇప్పటిదాకా తెలియలేదు. కానీ ఏ జిల్లాకు ఆ జిల్లాలో సీనియర్ నేతలతో వైసీపీ నుంచి వచ్చిన వారితో ఏర్పాటు చేసిన ఈ కమిటీ ద్వారా మాజీ వైసీపీ నేతలను ఆకట్టుకోవాలని వారిలో మంచి వారు అంటే ఆర్థికంగా బలవంతులకు పెద్ద పీట వేయాలని కూడా జనసేన సూత్రప్రాయంగా నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో అయితే కదలికలు రాజకీయంగా మొదలయ్యాయని అంటున్నారు.

**వైసీపీ మాజీల సంగతేంటి :** ఈ క్రమంలో వైసీపీని వీడి ఏ పార్టీలో చేరకుండా ఉంటున్న మాజీల సంగతి ఏమిటి అన్న చర్చ సాగుతోంది. అదే సమయంలో కూటమి పార్టీలలో చేరి అక్కడ తమకు తగిన ప్రాధాన్యత లేని వారి విషయం ఏమిటి అన్నది కూడా చర్చిస్తున్నారు. వైసీపీ అయితే రెండేళ్ల పాటు ఒక మాదిరిగా ఆందోళనలు చేసింది. ఇక జూన్ 12న కూటమి రెండేళ్ళ పాలనకు వెన్ను పోటు అన్న ఆందోళన తరువాత వైసీపీ జోరు పెంచింది. ప్రతీ ఇష్యూని తీసుకుని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోంది. ఏదో విధంగా కూటమిని ఇరుకున పెట్టాలని ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో వైసీపీ వైపు చూడాలని ఆలోచిస్తున్న వారిలో కూడా కదలిక మొదలైంది అని అంటున్నారు.

**ఆయన ఫ్యాన్ వైపుగా :** ఇక వైసీపీలో చేరేందుకు మాజీ నేతలు కొందరు చూస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. భీమవరంలో ఎమ్మెల్యేగా గెలిచిన గ్రంధి శ్రీనివాస్ 2019లో పవన్ కళ్యాణ్ నే ఓడించారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తారు అనుకుంటే దక్కలేదు, దాంతో ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారు. 2024 ఎన్నికల తరువాత తన వ్యాపారాల మీద కూడా ఒత్తిళ్ళు ఉండడంతో వైసీపీకి దూరం జరిగారు. ఒకానొక సమయంలో ఆయన బీజేపీ లేదా టీడీపీలో చేరుతారు అని కూడా ప్రచారం సాగింది. అయితే ఇపుడు లేటెస్ట్ టాక్ ఏంటి అంటే భీమవరం గ్రంధి శ్రీనివాస్ వైసీపీలోకి తిరిగి రీ ఎంట్రీ ఇస్తారని. దాని మీదనే ఇపుడు గోదావరి జిల్లాలలో ప్రచారం మొదలైంది.

**ఓకే అంటే రెడీ అంటూ :** ఇక ఉత్తరాంధ్రలోని మాజీ మంత్రితో పాటు మరి కొందరు వైసీపీ వైపు చూస్తున్నారు అని టాక్ నడుస్తోంది. అలాగే గుంటూరు జిల్లా ఇక మరి కొన్ని జిల్లాలలో కూడా వైసీపీని వీడిన వారు ఇతర పార్టీలలో చేరిన వారు కూడ ఇపుడు వైసీపీ వైపు రావాలని అనుకుంటున్నారు. అలాగే గతంలో వైసీపీలో కీలక పదవులు చేపట్టిన గోదావరి జిల్లాకు చెందిన మరో మాజీ మంత్రి కూడా ఫ్యాన్ పార్టీ వైపు చూస్తున్నారు అని టాక్ నడుస్తోంది. అయితే వీరి చేరికకు వైసీపీ అధినాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉందని అంటున్నారు. ఒక్కొక్కరిని కాకుండా అందరికీ ఒకే విధంగా పచ్చ జెండా ఊపి తీసుకోవాలా లేక అందరినీ దూరం పెట్టేయాలా అన్నది కూడా వైసీపీ హైకమాండ్ ఇంకా డెసిషన్ తీసుకోలేదని అంటున్నారు.

**వైసీపీ కూడా కమిటీ :** ఈ నేపథ్యంలో వైసీపీ కూడా తమ పార్టీలో రీజాయింగ్స్ కి మాజీ వైసీపీ నేతల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తుందా అన్న చర్చ అయితే సాగుతోంది. వైసీపీ వైపు ఎంత మంది చూస్తున్నారు, అలా వచ్చే వారు మళ్లీ హ్యాపీగా పార్టీలో కొనసాగుతారా లేదా, యాక్టివ్ గా వారు పాల్గొంటారా లేదా అన్నది పార్టీ కనుక కమిటీ ఏర్పాటు చేస్తే పరిశీలిస్తుందని అంటున్నారు. అలాగే మాజీలు వస్తే కనుక ప్రస్తుతం ఉన్న వారు ఏ విధంగా రియాక్ట్ అవుతారు ఇలా మళ్ళీ తిరిగి వచ్చే వారితో పార్టీకి ఏమైనా లాభం ఉంటుందా లేదా అన్నది కూడా వైసీపీ ఆలోచిస్తోంది. మరి వైసీపీ కూడా రీజాయింగ్ కమిటీని ఏర్పాటు చేస్తుందా లేక అధినాయకత్వం స్థాయిలోనే నిర్ణయం తీసుకుని గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా అన్నది చూడాల్సి ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## రేణుకది హత్యా? ఆత్మహత్యా?..



### రూమ్ నెం.1611లో ఏం జరిగింది?

**మెహదీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండీ లైన్స్ వద్ద ఉన్న లాడ్జిలో రేణుక (26) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్‌కు చెందిన రేణుకకు గోల్కొండ ప్రాంతానికి చెందిన ఫారుక్ (34)తో పరిచయం ఉంది. ఈ క్రమంలో ఇద్దరూ నిన్న రాత్రి హోటల్‌లో గదిని (రూమ్ నం.1611) బుక్ చేసుకున్నారు. తాను కొద్దిసేపు బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఉరివేసుకుని కనిపించిందని ఫారుక్ పోలీసులకు తెలిపాడు. అయితే, రేణుక కుటుంబ సభ్యులు ఇది ఆత్మహత్య కాదు.. హత్యేనని ఆరోపిస్తూ ఫారుక్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న లంగర్‌హౌస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ఫారుక్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయని పోలీసులు తెలిపారు.

## స్పీడ్‌పోస్ట్‌లో గంజాయి డోర్ డెలివరీ

**ఝార్ఖండ్ కేంద్రంగా 21 రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న ముఠా – ప్రధాన నిందితుడి అరెస్ట్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తపాలా శాఖ స్పీడ్‌పోస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలకు గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న సిండికేట్ గుట్టును హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) ఛేదించింది. ఝార్ఖండ్‌లోని గిరిఢీ జిల్లా నిమియాఘాట్‌లోని అటవీ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకున్న ముఠా.. వేల మందికి గంజాయి సరఫరా చేస్తోంది. మొత్తం ఐదుగురితో కూడిన ఈ గ్యాంగ్‌లోని ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు గంజాయి విక్రయాలతో గత ఐదేళ్లలో రూ.20 కోట్లకుపైగా ఆస్తులు పోగేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీస్ కమిషనర్ సజ్జనర్ గురువారం కేసు వివరాలు వెల్లడించారు.

**ఆ రెండు పోస్టాఫీసులే కేంద్రం**

ఝార్ఖండ్‌లోని నిమియాఘాట్ మండలంలోని తంబాగుడియో గ్రామానికి చెందిన సత్యం మిశ్రా తన అన్న శుభమ్ మిశ్రా, బంధువులు సచిన్ మిశ్రా, రాహుల్ ఝా, సంతోష్ పండిట్‌లతో కలిసి ముఠాను ఏర్పాటు చేశాడు. నిమియాఘాట్ ప్రాంతంలో దట్టమైన అడవుల్లో గంజాయి సాగు చేయించి.. కోరిన వారికి స్పీడ్ పోస్టు ద్వారా కొరియర్ చేయడం మొదలుపెట్టాడు. స్పీడ్ పోస్టు సమయంలో పోస్టాఫీసు సిబ్బంది తనిఖీ చేయకపోవడాన్ని అవకాశంగా తీసుకున్నారు. గిరిడీలోని ఇస్రీ బజార్, బొకారో జిల్లాలోని ఫుస్రో బజార్ పోస్టాఫీసుల ద్వారా గంజాయి పార్శిళ్లను పంపేవారు. చిన్న డబ్బాలో గంజాయి నింపి అందులో మెడిసిన్ ఉందంటూ పోస్టల్ అధికారులకు చెప్పేవారు. నిందితులు వాట్సప్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ తెలంగాణ, ముంబయి, తమిళనాడు, సహా దేశవ్యాప్తంగా దాదాపు 21 రాష్ట్రాల్లోని వినియోగదారులకు గంజాయి డోర్ డెలివరీ చేసేవారు.

**ఎలా బయటపడిందంటే..?**

ఇస్రీబజార్ నుంచి హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్, ఫుస్రోబజార్ నుంచి ఎస్ఆర్‌నగర్‌కు ఇటీవల గంజాయి పార్శిళ్లు వచ్చినట్లు హెచ్‌న్యూ విభాగానికి ఉప్పందింది. డెలివరీ తీసుకున్న సుశాంత్ వ్యాస్, లడ్డూలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా... ఝార్ఖండ్ నుంచి వచ్చినట్లు బయటపడింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన హెచ్‌న్యూ బృందం.. కొరియర్లు వచ్చిన పోస్టాఫీసుల చిరునామాలకు వెళ్లింది. 20 రోజుల పాటు అక్కడ మాటువేసి సత్యం మిశ్రాను అదుపులోకి తీసుకుంది. అప్పటికే మిగతా నిందితులు పరారయ్యారు.

## లఖ్‌నవూలో కూర్చొని.. అమెరికన్లకు టోకరా

**లఖ్‌నవూ, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ గుట్టును ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు రట్టు చేశారు. 119 మందిని అరెస్టు చేశారు. 103 ల్యాప్‌టాప్‌లను, 177 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 116 హెడ్‌సెట్లను, 8 ఇంటర్నెట్ రూటర్లను, ఒక బయోమెట్రిక్ డివైజ్‌ను, డిజిటల్ రికార్డులను, ఫోర్జ్‌డ్ డాక్యుమెంట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అమెరికన్లే లక్ష్యంగా ఈ కాల్ సెంటర్‌ను నడుపుతున్నారు. లఖ్‌నవూలోని సమిట్ బిల్డింగ్‌లో ఉన్న 11వ అంతస్తులో సోలారిస్ సొల్యూషన్స్ పేరుతో ఈ కాల్ సెంటర్ నడుస్తోంది. అందులోని ఉద్యోగులు.. తాము అమెరికాలోని ప్రఖ్యాత టెక్ కంపెనీలు, ఫెడరల్ ఏజెన్సీల ఉద్యోగులమని చెబుతూ అమెరికన్లకు ఫోన్లు చేసి మోసగిస్తున్నారు. పోలీసులకు ఉప్పందడంతో బుధవారం వారు దాడి చేశారు. ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కాల్ సెంటర్ రాత్రి వేళల్లో నడుస్తోందని పోలీసులు తెలిపారు. ఇంటర్నెట్ ఆధారిత కాలింగ్ వ్యవస్థలను వారు వినియోగిస్తున్నారని, వీవోఐపీతోపాటు నిషేధిత డయలర్ సాఫ్ట్‌వేర్‌ను వాడుతున్నారని వివరించారు.

పూజ గదిలో గొంతుకోసి..

## భార్య దారుణ హత్య

**హోసపెటే, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలోని విజయనగర జిల్లా హోసపెటేలో దారుణం జరిగింది. భార్య పూజ చేస్తుండగా భర్త గొంతుకోసి హతమార్చాడు. పట్టణంలోని 32వ వార్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభావతి (50) అనే మహిళ ఉదయం 11 గంటలకు ఇంట్లోని పూజ గదిలో అమ్మవారికి పూజ చేస్తుండగా భర్త రామమూర్తి కత్తితో గొంతుకోసి హతమార్చాడు. దీంతో ప్రభావతి అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు కారణమని ప్రాథమికంగా వెల్లడైనట్లు జిల్లా ఎస్పీ జాహ్నవి తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలుస్తాయని చెప్పారు. హోసపెటే ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఘట్‌కేసర్ సమీపంలో

## రైలు కిందపడి దంపతుల మృతి

**ఘట్‌కేసర్, విశ్వం వాయిస్ న్యూస్ :** రైలు కిందపడి దంపతులు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మేడ్చల్ మాల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపాయిపేట గ్రామానికి చెందిన దంపతులు రవికుమార్, శిరీష్ ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో ఘట్‌కేసర్ – బీబీనగర్ రైల్వే మార్గంలోని ఎన్ఎఫ్‌సీ సమీపంలో రైలు కిందపడి మృతి చెందారు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వీరిద్దరూ ప్రస్తుతం హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నట్లు సమాచారం.

కూలి పనికి తీసుకెళ్లి..

## 21 గంటలు బావిలోనే మహిళ



**కరీంనగర్ కొత్తపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** కూలి పని ఉందని చెప్పి ఓ మహిళను తీసుకెళ్లి... ఆమె ఒంటిపై ఉన్న కాసింత బంగారాన్ని లాక్కొని బావిలోకి తోసేసిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో చోటు చేసుకుంది. చుట్టూ చీకటి.. ఆదమరిస్తే ముంచేసే నీరు.. ఎంత అరిచినా పట్టించుకునే దిక్కులేని పరిస్థితుల్లో ఆమె బావిలో 21 గంటల పాటు క్షణమొక యుగంగా గడిపి ఎట్టకేలకు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. కిసాన్‌నగర్‌కు చెందిన గంగాధర లక్ష్మి(55) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం కుమారుడు సందీప్.. ఆమెను టవర్ సర్కిల్ సమీపంలోని లేబర్ అడ్డా వద్ద దింపాడు. ఓ వ్యక్తి కూలి పని ఉందని చెప్పి ఆమెతో ఒప్పందం చేసుకున్నాడు. నుస్తులాపూర్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాక బెదిరించి ఆమె వద్ద ఉన్న సుమారు 0.5 గ్రాములు బంగారు ఆభరణాలు, రూ.4,000 లాక్కుని సుమారు 11 గంటల ప్రాంతంలో బావిలోకి తోసేశాడు. ఆమె బావిలో ఉన్న తాడును పట్టుకోగా.. అది గమనించిన ఆగంతకుడు ఆ తాడును కోసేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె ఈత కొడుతూ మోటారుకున్న పైపును పట్టుకుని ప్రాణాలు బిగబట్టుకుని రాత్రంతా ఉండిపోయారు.

**తల్లి ఇంటికి రాకపోవడంతో...**

రాత్రి అవుతున్నా తల్లి ఇంటికి రాకపోవడంతో కుమారులు సతీష్, సందీప్‌లు కరీంనగర్ మూడో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఫోన్ నంబరుతో లొకేషన్ తెలుసుకున్న పోలీసులు గ్రామమంతా వెతికినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం 7 గంటల సమయంలో అటుగా వెళ్లిన బావి యజమానికి సమీపం నుంచి కేకలు వినిపించాయి. బావిలోకి తొంగి చూడగా లోపల భయంతో విలపిస్తున్న మహిళ కనిపించారు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వగా వారు ఆమెను బయటకు తీశారు.








# తెలుగు సినీ వినీలాకాశంలో నటశిఖరం ఎస్వీఆర్

**తెలుగు సినీ చరిత్రలో చిరస్మరణీయుడిగా మహానటుడు ఎస్వీఆర్ - నగరంలో ఎస్వీఆర్ జయంతి వేడుకలు ఘనంగా**
**పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు, చిరంజీవి ఫ్యాన్స్, ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ**
**మహానటుడికి ఘన నివాళులర్పించిన రాజకీయ, సామాజిక, సినీ ప్రముఖులు - పేదలకు నూతన వస్త్రాల పంపిణీతో సేవా కార్యక్రమాలు**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు సినీ వినీలాకాశంలో నటశిఖరం ఎస్వీ రంగారావు అని పలువురు ప్రముఖులు అన్నారు. తెలుగు చలనచిత్ర రంగంలో తన అపూర్వ నటనతో చిరస్థాయిగా నిలిచిన విశ్వనటచక్రవర్తి ఎస్.వి. రంగారావు (ఎస్వీఆర్) జయంతి వేడుకలు శుక్రవారం రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టుపై ఉన్న ఆయన విగ్రహం వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్, ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని మహానటుడికి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన మహానటుడు ఎస్వీఆర్ తెలుగు సినీ చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని కొనియాడారు. తెలుగు చిత్రసీమ ఉన్నంతకాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీ తదితర భాషల్లోనూ నటించి అంతర్జాతీయ ఖ్యాతి పొందిన గొప్ప నటుడిగా ఎస్వీఆర్‌ను అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి విగ్రహ దాత, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ టి.కె విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ప్రముఖ కాంట్రాక్టర్ ఆర్.సుబ్బరాజు, ఇసుకపల్లి వీర్రాజు, తోట సుబ్బారావు, టీడీపీ నేత యర్రా వేణు గోపాలరాయుడు, జనసేన సిటీ ఇన్‌చార్జి వై. శ్రీనివాస్, ఎస్వీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి వేడుకలు వరుసగా 13వ సంవత్సరం నిర్వహించడం విశేషం. యెనుముల రంగబాబు, కొత్తపేట రాజా, గుదే రఘునరేష్, నామన వాసు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, సభకు యెనుముల రంగబాబు అధ్యక్షత వహించారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ, 2014లో అప్పటి కేంద్ర మంత్రి మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఎస్వీఆర్ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిందని గుర్తుచేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, చిరంజీవి ఫ్యాన్స్, ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, అభిమానులు అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. వచ్చే ఏడాది నుంచి జయంతి వేడుకలను కొత్తపేట రాజా, యెనుముల రంగబాబు, గుదే రఘునరేష్, నామన వాసు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు టవల్స్, ప్యాంట్లు, షర్టు, నూతన వస్త్రాలు పంపిణీ చేయగా, అనంతరం పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు కార్యకర్తలకు కూడా చీరలు పంపిణీ చేశారు. ఎస్వీఆర్ విగ్రహదాత రౌతు సూర్యప్రకాశరావుకు, అలాగే రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌కు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు, కేబుల్ ఆపరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, చిరంజీవి-ఎస్వీఆర్ అభిమానులు, మహిళలు మరియు వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు సాగు నీళ్లు అందించాలి

**ముసురు మిల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీయరా..? : ఏపీ ఆదివాసీ జేఏసీ సూటి ప్రశ్న**







**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీసి మరియు చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు ఏర్పాటుచేసి సాగునీరు అందించరా..? అని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తుంది. కానీ రైతులకు సాగునీరు అందించడంలోను మరియు అభివృద్ధి సంక్షేమం విషయంలోను క్షేత్ర స్థాయిలో పూర్తిగా విఫలమైందన్నారు.ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పూడిక తీయడానికి 70 లక్షలు రూపాయలు మంజూరు చేసిందన్నారు.కానీ ముసురు మిల్లి ప్రాజెక్టు కాలువ చివరి వరకు పూడికతీత పనులు పూర్తిగా కాకపోవడంతో దేవారం,శరభ వరం గ్రామపంచాయతీల రైతులకు సాగునీరు అందని ద్రాక్ష మారిందన్నారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ తొలకరి నాటికే చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు ఏర్పాటు చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులతో పక్కాగా ప్రణాళికలు రూపొందించారు..కానీ నేటికీ చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు నిర్మించలేదన్నారు.మరోవైపు అధికారులు ప్రజా ప్రతినిధులు చెబుతున్న అభివృద్ధి మాటల్లోనే ఉంది కానీ క్షేత్ర స్థాయిలో లేదని విమర్శించారు.ఈ సంవత్సరం కూడా రైతుల పంట భూములకు సాగునీరు అందించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సిరి ధాన్యాలు కందులు, మినుములు, పెసర్లు, బొబ్బరులు, చోళ్ళు, గంటెలు, సామలు, జొన్నలు మొదలైనవి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే సంబంధిత శాఖ అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పూడికతీత పనులు మరల తిరిగి ప్రారంభించాలని, చెరువులకు కొత్త స్లూయిజ్లు,తూములు,కలవర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, భారత్ ఆదివాసీ పార్టీ స్టీరింగ్ కమిటీ జిల్లా ప్రసార కార్యదర్శి చవలం విద్యాసాగర్ మొదలైన వారు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం దిశగా బిజెపి - పలు వినతులు స్వీకరణ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాంపేట కార్పొరేట్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బూర రామచంద్ర రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. కాతేరు గ్రామ జల్లి పేట వాసులు మంచి నీరు లేక పడుచున్న భాధలు చెప్పు కుని, వాటర్ టాంకు నిర్మిచాలని కోరారు, కోలమూరులో గ్రామంలో డ్రైనేజీ,వికలాంగులు పింఛన్ల తదితర సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని బూర రామచంద్రరావు తెలిపారు. ప్రజాసేవే పరమావధి గా,ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈరోజు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం



చేస్తామన్నారు. కార్యక్రమ జోనల్ ఇన్చార్జ్ బొమ్మలు దత్తు, రాష్ట్ర నాయకులు జనతా వారధి జిల్లా కో కన్వీనర్ యానాపు ఏసు, స్వామి సూర్య కిరణ్, మీనాక్షి,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే శ్రీ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మరోసారి తన సేవాభావాన్ని చాటిచెప్పారు. తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక 41వ డివిజన్‌కు చెందిన ఓ పేద విద్యార్థికి విద్యా ఫీజుల నిమిత్తం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంటనే స్పందించి, ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఫీజుల కోసం ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ "పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు... చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి తమ వంతు సహాయం అందించేందుకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి సేవ చేయాలని, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడితో సమానం" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కూడా విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు దాతల సహకారం కూడా పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వర్రే శ్రీనివాసరావు, కొల్లి బుజ్జి, చాపల చిన్నరాజు, సలాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిఐ బ్రహ్మాస్త్రంతో విశ్రాంత ఉపాధ్యాయురాలికి న్యాయం



**ఆర్‌టీఐ దరఖాస్తుతో కదిలిన ఈపీఎఫ్ అధికారులు**
**పెండింగ్ భవిష్యనిధి సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ**


**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సామాన్యులకు ఎంతటి శక్తివంతమైన ఆయుధమో మరోసారి రుజువైంది. రాజమహేంద్రవరానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు కొండ సూర్య కళ్యాణికు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల భవిష్యనిధి సొమ్ము, ఆర్‌టీఐ చట్టాన్ని ఆశ్రయించడంతో విడుదలైంది. తెనాలిలోని వీఎస్ఆర్-ఎన్‌వీఆర్ కళాశాలలో పనిచేసిన కొండ సూర్య కళ్యాణి ఉద్యోగుల భవిష్యనిధి పింఛన్ కోసం దరఖాస్తు చేయగా, అవసరమైన సంతకాల విషయంలో కళాశాల యాజమాన్యం సహకరించలేదని ఆమె తెలిపారు. దీంతో 2023 అక్టోబర్ 13న గుంటూరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. తదనంతరం రాజమహేంద్రవరం వీరభద్రపురానికి చెందిన న్యాయవాది బాలాజీ ప్రసాద్ పాండే సలహాతో సమాచార హక్కు చట్టం- 2005లోని సెక్షన్ 6(1) కింద ఆర్‌టీఐ దరఖాస్తు సమర్పించి సంబంధిత అధికారులను పలు ప్రశ్నలు అడిగారు. దీంతో గుంటూరు ప్రాంతీయ ఈపీఎఫ్ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, కొండ సూర్య కళ్యాణి బ్యాంకు ఖాతాలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల భవిష్యనిధి సొమ్మును జమ చేశారు. ఈ సందర్భంగా కొండ సూర్య కళ్యాణి మాట్లాడుతూ "సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిది. నాకు న్యాయం జరిగేలా సహకరించిన ఆర్‌టీఐ అధికారులు, న్యాయవాది బాలాజీ ప్రసాద్ పాండే, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

**సీతానగరం మండల కేంద్రంలో**

# ఘనంగా భారత క్రైస్తవ దినోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలోని రెవ. జాబెజ్ స్థానిక సంఘములో నిర్వహించిన భారత క్రైస్తవ దినోత్సవ వేడుకలు సీతానగరం యునైటెడ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని సేవకులందరూ ఈ కార్యక్రమంలో సంతోషంగా పాల్గొన్నారు. దేవుడు తన సేవకులం దరినీ ఒకే మనస్సుతో, ఒకే లక్ష్యంతో ఏకపరచి నందుకు ఆయనకు మహిమ చెల్లిస్తున్నామని ఈ ఐక్యతను ఎల్లప్పుడూ కొనసాగిస్తూ, ఒకరినొకరు బలపరుస్తూ, క్రీస్తు సువార్త విస్తరణ కోసం కలిసి పనిచేద్దామని దేవుని మహిమ కొరకు మన భారతదేశాన్ని క్రీస్తునకు సంపాదించుటకు మనమందరం ఐక్యంగా ప్రార్థిస్తూ, సేవ చేస్తూ, సువార్తను ధైర్యంగా ప్రకటిద్దామని యునైటెడ్ పాస్టర్స్ సీతానగరం మరియు జేఏసీ తెలియజేసింది.



ద్రాక్షారామం అగ్నిబాధితులకు

# అండగా డాక్టర్ కాద వెంకటరమణ

## మంత్రి సుభాష్‌కు రూ.2 లక్షల విరాళం చెక్కు అందజేత



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం మార్కెట్ అగ్నిప్రమాద బాధితులకు అండగా ప్రముఖ వైద్యుడు, సత్య స్కాన్స్ అండ్ డయాగ్నస్టిక్స్ అధినేత డాక్టర్ కాద వెంకటరమణ ముందుకొచ్చారు. బాధితుల సహాయార్థం రూ.2 లక్షల విరాళం చెక్కును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు అందజేశారు. ద్రాక్షారామం మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను ఆదుకునేందుకు మంత్రి సుభాష్ వ్యక్తిగతంగా రూ.20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించడంతో పాటు, దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంత్రి చేసిన ఈ విజ్ఞప్తికి విశేష స్పందన లభిస్తుండగా అందులో భాగంగా డాక్టర్ కాద వెంకటరమణ తన వంతు సామాజిక బాధ్యతగా రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజం పట్ల బాధ్యతతో స్పందించిన డాక్టర్ కాద వెంకటరమణను ఆయన అభినందించారు. అగ్నిప్రమాద బాధితుల పునరావాసం కోసం మంత్రి సుభాష్ ప్రత్యేక చొరవతో మార్కెట్‌లో నూతన షెడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. బాధితులను ఆదుకునేందుకు మంత్రి తీసుకుంటున్న చర్యలు, చూపుతున్న మానవత్వానికి నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ నాయకుడు దంగేటి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ గడువును పెంచాలి

### వైసీపీ నేత కోన వెంకట శ్రీనివాసరావు



### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి

**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర లోపాలు దొర్లాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును భద్రపరిచేందుకు ప్రస్తుత జూలై 14 గడువును మరో నెల రోజుల పాటు పొడిగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శి కోన వెంకట శ్రీనివాసరావు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం నాలుగు కోట్ల పదహారు లక్షల మందికి పైగా ఓటర్లు ఉండగా, పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరుకూ వ్యక్తిగతంగా వివరాల సేకరణ పత్రాలు అందించి సవరణలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రాథమిక విధిని విస్మరించారని, ఫలితంగా ఇప్పటివరకు కేవలం ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల నలభై ఎనిమిది పత్రాలు (మొత్తం ఓటర్లలో కేవలం ముప్పై శాతం) మాత్రమే గణన వ్యవస్థలోకి ఎక్కాయని ఆయన గణాంకాలతో వివరించారు. అనేక నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ ఐదో వంతు కూడా పూర్తి కాలేదని, ఓటర్లకు పత్రాలు అందకుండానే అందినట్లు రికార్డులు సృష్టించారని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, అసాధారణంగా అధిక పంపిణీ నమోదైన ప్రాంతాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు తక్షణమే యాదృచ్ఛిక ధ్రువీకరణ చేపట్టాలని, తప్పుడు నివేదికలిచ్చిన క్షేత్రస్థాయి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా అంతర్జాల సౌకర్యం లేని గిరిజన, అటవీ, దూర ప్రాంతాల ఓటర్లు నష్టపోకుండా ఉండాలంటే అన్ని నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ సమానంగా పూర్తయ్యే వరకు తదుపరి దశలకు వెళ్లకూడదని, తక్షణమే అదనపు సమయం కేటాయిస్తూ ఎన్నికల సంఘం తగిన ఆదేశాలు జారీ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గట్టిగా డిమాండ్ చేశారు.

## 5వ రోజు కూడా జనసేన దరఖాస్తుల వెల్లువ

### అమలాపురం పార్లమెంట్ పరిధిలో 500కు పైగా దరఖాస్తుల స్వీకరణ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియకు విశేష స్పందన లభిస్తోంది. అమలాపురం పార్లమెంట్ పరిశీలకుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్టీ నిర్మాణ సారథుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఐదో రోజుకు చేరుకోగా, జనసైనికులు, నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ దరఖాస్తులను సమర్పించారు. శుక్రవారం (జూలై 3) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమలాపురంలోని ఎర్రవంతెన సమీపంలోని వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో దరఖాస్తులను స్వీకరించారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలను రాతపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్దేశించిన లక్ష్యాలు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై జనసైనికులకు అవగాహన కల్పించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తన అనుభవాలను, సూచనలను దరఖాస్తు రూపంలో అందించాలని కోరారు. ఒక్కరోజే సుమారు 500కు పైగా దరఖాస్తులు అందడం పార్టీ నిర్మాణ కార్యక్రమానికి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జూలై 5 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో కొనసాగుతుందని పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ పరిధికి చెందిన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యులు, ఐటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## భీమేశ్వరాలయ పార్కింగ్ స్థలాన్ని పరిరక్షించాలి

### వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి నరాల డిమాండ్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణానికి ఉత్తర దిశలో ఉన్న పంచాయతీ ఖాళీ స్థలాన్ని భవిష్యత్తులో ఎలాంటి ఇతర నిర్మాణాలకు కేటాయించకుండా భక్తుల పార్కింగ్ నిమిత్తం పరిరక్షించాలని రామచంద్రపురం మండలం వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి నరాల డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె రామచంద్రపురం మండలం ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ద్రాక్షారామ పంచాయతీ ప్రత్యేక అధికారికి ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి నరాల మాట్లాడుతూ ద్రాక్షారామ గ్రామానికి భీమేశ్వరాలయం అనేది ఒక ఉనికి మరియు మనుగడ అని పేర్కొన్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చే వేలాది మంది భక్తుల వాహనాలను నిలుపుకోవడానికి (పార్కింగ్) ఈ ఖాళీ స్థలం ఎంతో అనుకూలంగా ఉందని ఆమె తెలిపారు. ఈ భూమి దేవస్థానానికి చెందినది కానప్పటికీ, పంచాయతీ స్థలంగా ఉన్న ఈ ప్రదేశంపై ఎలాంటి మీమాంస (సందేహాలు) పెట్టుకోకుండా, దీనిని ఇతర నిర్మాణాలకు ఇవ్వకుండా కాపాడాల్సిన బాధ్యత ద్రాక్షారామ పంచాయతీ అధికారులపై ఎంతైనా ఉందన్నారు. గ్రామ ప్రజలుగా తమకు కూడా ఈ బాధ్యత వర్తిస్తుందని ఆమె స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం మరియు గ్రామం యొక్క ప్రయోజనాల దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రశ్న రావన్‌ను కఠినంగా శిక్షించాలని

## ఎస్ఐకి వినతిపత్రం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు రామచంద్రపురం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావుకి వినతిపత్రం అందించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాక, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రశ్న రావణ్ కవ్వింపు చర్యలు చేస్తున్నాడంటూ ఆరోపించారు. దోషిగా ఉన్న ప్రశ్న రావన్ను కఠినంగా శిక్షించాలని జన సైనికులు ఎస్సైను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసిపి నాయకులు రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించి తమ పబ్బం గడుపుకునేందుకు కులాల మధ్య కుమ్ములాటలు తెచ్చే విధంగా రెచ్చగొట్టే వారని, నేడు మతాల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలు రెచ్చగొడుతున్నారనీ మండి పడ్డారు. రావణ్ వెనుక వైకాపా నేతలు అండగా ఉండి డ్రామా ఆడుతున్నారని, ఆ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని చంద్రశేఖర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు గొల్లపల్లి కృష్ణ, అడ్వకేట్ కమల కుమారి, శ్రీహరి పంతులు, కొండ్రెడ్డి శ్రీనివాసరావు, మట్టా దుర్గారావు పడాల లోవరాజు, పోలిశెట్టి పెదబాబు, అంకం శ్రీనివాసరావు, వడ్డి సత్తిబాబు, సలగల వెంకటేష్, నల్లా సుధాకర్, సాయిమణి, అల్లం నాగు, దొడ్డా ప్రసాద్, పోలిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం భాష్యం పాఠశాలలో

## విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రామచంద్రపురం భాష్యం పాఠశాలలో విద్యార్థులకు చట్టాలు మరియు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐ వెంకట నారాయణ, ఎస్ఐ ఎస్. నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో నేరాల తీరు మారిందని, స్మార్ట్ ఫోన్ల వాడకం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటున్నాయని హెచ్చరించారు. ఓటీపీ ల ద్వారా జరిగే మోసాలు, పాత వస్తువులు, వాహనాలను తక్కువ ధరకే అమ్ముతామని నమ్మించి చేసే మోసాలు, డిజిటల్ అరెస్టులు, గుర్తుతెలియని ఏపీకే ఫైల్స్ పట్ల అప్రమత్తంగా ఉండి, మనల్ని మనం రక్షించుకోవాలని సూచించారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే ముఠాలు ఉన్నాయని, ఆన్లైన్లో ఎవరైనా బహుమతులు ఇస్తామని ఆశచూపినా లేదా భయపెట్టినా ఏమాత్రం ఆందోళన చెందకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ధైర్యం చెప్పారు. రోడ్డు భద్రత గురించి వివరిస్తూ.. మైనర్లయిన బాలబాలికలు మోటార్ సైకిళ్లు నడపకూడదని, తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా విద్యార్థులే వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జోనల్ ప్రిన్సిపాల్ వి. గోవిందరాజు, ప్రిన్సిపాల్ పి. భాస్కరరావు, ఇతర పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార వేదిక




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్లో అమలాపురం శాసనసభ్యులు ఆనందరావు వినతులు స్వీకరించారు. తక్షణ పరిష్కారం చేయాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చాలా మంది పుర ప్రజలు వారి సమస్యలను వినతలు రూపంలో తెలియజేయడం జరిగింది. ఈ దర్బార్లో టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, అమ్ముడు చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, కర్రి దత్తుడు మట్ట ప్రభాకర్, జనసేన నాయకులు సుధా చిన్న, నల్లా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూములకు శాశ్వత భరోసా : ఎమ్మెల్యే దాట్ల



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం గాడిలంకలో 293 మంది రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం పంపిణీ చేశారు. రైతుల భూ హక్కులకు శాశ్వత భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నూతన పాసుపుస్తకాలు భవిష్యత్తులో భూ హక్కుల నిర్ధారణకు కీలకఆధారాలుగానిలుస్తాయని వెల్లడించారు.

## చికిత్స పొందుతూ జనసేన నాయకులు భాస్కర్ కన్నుమూత



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గం ఏ.వేమవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గోకరకొండ భాస్కర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. గత రెండు రోజులుగా అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. గోకరకొండ భాస్కర్ జనసేన నాయకుడు లింగోలు పండుకు ప్రధాన అనుచరుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సేవలందించారు. భాస్కర్ మృతిపై జనసేన నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, పార్టీకి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని నివాళులర్పించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### పీజీఆర్ఎస్‌లో ప్రజల వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**మురమళ్ళ, విశ్వం వాయిస్ న్యూస్:** మురమళ్ళలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక మరియు మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రాలను ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు అందజేశారు. అర్జీదారుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించగల అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, మరికొన్ని సమస్యలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు వెల్లడించారు.

విశాఖ ఉక్కు కార్మికులకు న్యాయం చేయాలని

## అమలాపురంలో భారీ నిరసన




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పో యిన అమాయక కార్మికుల కుటుంబాలకు తక్షణమే ఒక కోటి రూపాయల చొప్పున భారీ నష్టపరిహారం చెల్లించాలని, ఈ దుర్ఘటనపై తక్షణమే ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నడిబొడ్డున ఉన్న గడియార స్తంభం కూడలి వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉధృతమైన రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి ప్రజా సంఘాల ముఖ్య నాయకులు, వందలాది మంది శ్రామికులు ఎర్రజెండాలు, నీలిజెండాలు చేతబూని రోడ్లపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రాణాంతక ప్రమాదాలు మళ్లీ పునరావృతం కాకుండా కర్మాగారాలలో పని చేసే ప్రతి ఒక్క కార్మికుడి ప్రాణానికి పూర్తి భరోసా కల్పిస్తూ అత్యంత కట్టుదిట్టమైన రక్షణ మరియు భద్రతా చర్యలు చేపట్టాలని, యాజమాన్యాల నిర్లక్ష్యాన్ని వీడి కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలని ఈ సందర్భంగా వక్తలు గట్టిగా డిమాండ్ చేశారు.

## మెకానిక్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ మెకానిక్ల దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలో కార్మికులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టూ వీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మెకానిక్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. వారికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి కోసం ఎలాంటి ష్యూరిటీ లేని రూ.3 లక్షల వడ్డీలేని సబ్సిడీ రుణాలు మంజూరు చేసిఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# పంచాయతీ రాజ్‌ను గిన్నీస్ బుక్‌లోకి ఎక్కించాం : పవన్ కల్యాణ్



రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో పనితీరును మెరుగు పరిచి గిన్నీస్ బుక్‌లో స్థానం దక్కేలా చేశామని ఉప ముఖ్య మంత్రి, రాష్ట్ర అటవీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుపతి జిల్లా ముక్కావారి పల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో వీబీజీరాంజీ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. 2047 వికసిత భారత్ లక్ష్యంగా కేంద్రంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అత్యధికంగా నిధులు కేటాయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీబీజీరాంజీ పథకం ఎంతో లబ్ధి చేకూరుస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. వందరోజుల నుండి 125 రోజులకు ఉపాధి హామీ పెరిగిందన్నారు. గతంలో ఉపాధి నిధులతో 7 వేల కిలోమీటర్ల మేరకు సీసీ రోడ్లు వేశామ ని, గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులకు 58 కోట్ల 48 లక్షల పనిదినాలు కల్పించామని తెలిపారు. వందల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. గతంలో 24వ స్థానంలో ఉన్న గ్రామీణ పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రస్తుతం తొలిస్థానానికి చేరుకుందని.. దీనికి ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహమే కారణమని తెలిపారు. భవిష్యత్తులో అందరికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో వీబీజీరాంజీ పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు పారదర్శకమైన చెల్లింపులు కోసం నేరుగా వారి ఖాతాలకే నగదు జమ చేస్తామన్నారు. ఎక్కడ ఏ పనులు చేపట్టాలన్నది.. ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లోనే నిర్ణయిస్తారని చెప్పారు. గ్రామ స్వరాజ్యమే వీబీజి రామ్ జీ లక్ష్యమని తలెఇపారు. అభివృద్ధిలో వెనుకబడి ఉన్న పంచాయతీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెరుగుతాయని, సామాజిక భద్రత పెరుగుతుందన్నారు. జలధార ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని పవన్ కల్యాణ్ చెప్పారు. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తోందన్నారు. 13 వేలకు పైగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించామని అన్నారు. రాష్ట్రం మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కల్యాణ్ తెలిపారు.

# ఇంకా దొరకని చిన్నారి ఆచూకీ

### అభ్యర్థిస్తున్న తల్లిదండ్రులు



**తుని పట్టణం, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయితీ పరిధిలో సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై 27 రోజుల పైబడినా ఇంకా ఆచూకీ లభ్యం కాకపోవడంతో చిన్నారి తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఓ వైపు పోలీసుల దర్యాప్తు అన్ని కోణాల్లో కొనసాగుతోంది. మరోవైపు చిన్నారి తల్లిదండ్రుల ఆవేదన అందర్నీ కలచి వేస్తోంది. చిన్నారి అదృశ్యంపై ఆమె వివరాలతో పోలీసులు కర, గోడ పత్రికలు ముద్రించి గ్రామాల్లో అంటించి ఆచూకీ తెలపాలని, ఆచూకీ చెప్పిన వారికి రూ. లక్ష ఇస్తామని ప్రకటించారు. ఆ గోడ పత్రికలతో చిన్నారి తండ్రి గణేష్ ఏజెన్సీ, ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ కన్నబిడ్డ కోసం తండ్రిగా ప్రయత్నం చేస్తూ గోడ పత్రికలను ఆయా ప్రాంతాల్లో అతికిస్తూ, ఆరాతీస్తున్నారు. తన బిడ్డను తనకు అప్పగించాలని తల్లి భవానీ వేడుకుంటోంది. ఎవరైనా తీసుకువెళ్తే ఎవరి వద్ద అయినా ఉంటే తమకు అప్పగించాలని అభ్యర్థిస్తున్నారు.

### ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో

# దొంగల బీభత్సం



**తుని పట్టణం, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని – అనకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో ప్రయాణికులను కత్తులతో బెదిరించి నగదు, సెల్‌ఫోన్లు దోచుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో చివరి జనరల్ బోగీలో గురువారం ఉదయం జరిగింది. తుని స్టేషన్ దాటిన తర్వాత బోగీలో నలుగురు వ్యక్తులు కత్తులు చూపించి నగదు, సెల్‌ఫోన్లు ఇవ్వాలని బెదిరించారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన ఆరుగురు ప్రయాణికుల నుంచి సుమారు రూ.30 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు దోచుకున్నారు. వెంటనే కొందరు ప్రయాణికులు 139కు ఫోన్ చేసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

**నలుగురి అరెస్ట్**

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి పాల్పడిని నలుగురిని విజయవాడ ప్రాంతానికి చెందిన షేక్ రఫీ, వనర్జీ పౌల్, సబ్బవరపు సాంబశివరావు, సింధీ పాల్‌గా గుర్తించి అనకాపల్లిలో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు గంజాయికి అలవాటు పడి నేరాలకు పాల్పడినట్లు తేల్చారు. సీసీ కెమెరాలు, నిందితుడి పాత నేర చరిత్ర, సెల్‌ఫోన్ సిగ్నల్, బాధితుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ద్రాక్షారామ బిజెపి కార్యాలయంలో పార్టీ మండల సమావేశం



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేటి శ్రీకృష్ణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి వారంలో నిర్వహించే మండల సమావేశాలు పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ఎంతో కీలకమైనవని అన్నారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే దానిపై చర్చించడంతో పాటు, పార్టీ సభ్యత్వ విస్తరణ, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, రాబోయే కార్యక్రమాల కార్యా చరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించాలని బిజెపి సీనియర్ నాయకుడు కర్రి చిట్టిబాబు సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సేవే లక్ష్యంగా పనిచేయాలని మండల స్థాయిలో సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందేందుకు అందరం అంకితభావంతో ముందుకు సాగుదామని కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి, యువమోర్చ జిల్లా కార్యదర్శి తోలేటి సూర్య గంగాధర్, ఉపాధ్యక్షుడు శాఖా బాల సుబ్రహ్మణ్యం, మండల ఓ.బి.సి మోర్చ అధ్యక్షుడు ఇంధన సత్యనారాయణ, బిజెపి ఎస్.సి.మోర్చ నాయకుడు పెయ్యల రాంబాబు, మైనార్టీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అన్వర్ భాషా, మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు బి. పద్మావతి, బిజెపి నాయకుడు అప్పన రాజశేఖర్ తదితర బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మోదీ పన్నెండు సంవత్సరాల సుపరిపాలనపై అవగాహన కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచారు.

# రైతన్నల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మీ భూమి మీకే సొంతం, ఆ భూమిపై మరెవ్వరికీ హక్కు లేదు అని చాటడానికి రాజముద్రతో రైతన్నలకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో శుక్రవారం జరిగిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నలకు పాస్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులను కాపాడుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి వైసీపీ హయంలో ఉండేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అన్నదాతల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సరిహద్దు రాళ్లపై, పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ తన బొమ్మలు వేసుకుని రైతన్నలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. అలాగే దానికి తోడుగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి కోర్టులకు కూడా వెళ్లకుండా చేసి తమ చెప్పు చేతల్లో రైతుల హక్కులు పెట్టుకున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే రద్దు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో పంపిణీ చేస్తున్నామన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనమన్నారు. నా పూర్వీకుల ఆస్తి నా సొంతం అనేలా రాజముద్రతో పుస్తకాలు ఇస్తున్నామన్నారు. అలాగే రీసర్వేలో జరిగిన అవకతవకలు, రైతులు పడుతున్న ఇబ్బందులు చక్కదిద్దడానికి ప్రభుత్వం పెనుమార్పులు తీసుకువచ్చిందన్నారు. పాసు పుస్తకాల్లో ఏదైనా తప్పులు దొర్లితే సరిచేయడానికి కలెక్టర్ వరకూ వెళ్లాల్సిన అవసరం లేకుండా కలెక్టర్ కి, జాయింట్ కలెక్టర్ కి ఉన్న అధికారాలను ఆర్డీవోలకు, తాసిల్దార్ల కి బదిలీ చేసి రైతులకు ఎంతగానో మేలు జరిగేలా చేశారన్నారు. దీనితో రైతులకు ఏర్పడుతున్న ఇబ్బందులు స్థానికంగా పరిష్కరించడానికి సులువైన మార్గం ఏర్పడిందన్నారు. అయినా ఇంకా అనేకచోట్ల చాలా సమస్యలు నెలకొని ఉన్నాయని వాటన్నిటినీ పరిష్కరిస్తున్నామని తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

### ఆర్థికంగా చేదోడుగా నిలవడమే లక్ష్యం : ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందుల వల్ల వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయనిధి భరోసానిస్తుం దని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మం డపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామా లకు, వార్డులకు చెందిన 24 మంది బాధితులకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ. రూ.20,36,575/-లు విలువైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ఆసుపత్రులలో భారీ ఖర్చులతో చికిత్స చేయించుకుని, ఆర్థికంగా కుంగిపోయిన కుటుంబాలకు ఈ నిధులు ఎంతో భరోసానిస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూపాయి ఖర్చు లేకుండా, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సీఎం సహాయనిధి అందుతుందని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, దరఖాస్తు చేసుకున్న తక్కువ కాలంలోనే నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం లబ్దిదారులు మాట్లాడుతూ వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, చేతిలో పైసా లేక ఇబ్బంది పడుతున్న సమయంలో ఈ చెక్కులు అందడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. తమ కష్టాన్ని గుర్తించి, ప్రత్యేక శ్రద్ధతో చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కి, ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి కి లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి

# సమష్టిగా కృషి చేయాలి

### పెద్దాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కుదుపూడి సత్తిబాబు సమీక్ష సమావేశం



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంటు అధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ మరి పెద్దాపురం నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కుదుపూడి సత్తిబాబు, పెద్దాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ నూనె రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన పత్రాలు, దరఖాస్తులను గడువులోగా సమర్పించేలా ప్రతి కుటుంబాన్ని చైతన్యపరచాలని, ఓటు హక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో బూత్ స్థాయి కార్యకర్తలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఎల్‌వోలు, ఎన్యూమరేటర్లతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అపోహలకు తావు లేకుండా ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాలని, గడువులోపు దరఖాస్తుల సమర్పణ పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూత్ స్థాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్ శాఖ సేవలను

# ప్రైవేట్ పరం చేయొద్దు

### రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద దస్తావేజు లేఖర్లు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేట్ పరం చేయొద్దని, దస్తావేజు లేఖరులకు లైసెన్సులు మంజూరు చేయాలని, లేఖరుల, స్టాంపు వెండర్ల, డి.టి.పి. ఆపరేటర్లకు ఉపాధి కల్పించాలని రావులపాలెం రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు నిరసన తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు స్టాంపు వెండర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భముగా లేఖరులు మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఇటీవల విడుదల చేసిన జిఓ నెంబరు 396 ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేట్ పరం చేయొద్దని, దస్తావేజు లేఖరులకు లైసెన్సులు మంజూరు చేయాలని, లేఖరుల, స్టాంపు వెండర్ల, డి.టి.పి. ఆపరేటర్లకు ఉపాధి కల్పించాలని తెలిపారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ సబ్ రిజిస్ట్రార్ కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ వైఖరిని బట్టి ముందు తమ నిరసన మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి రామ మోహన రెడ్డి, పులుగుర్త రామారావు, పోతప్రగడ శ్రీరామ కుమార్, కర్రి శ్రీనివాస రెడ్డి, యర్రంశెట్టి సుబ్బారావు, మానేపల్లి నాగేశ్వర రావులతో పాటు అందరు దస్తావేజు లేఖర్లు స్టాంపు వెండర్లు సబ్బెళ్ల సూర్యనారాయణ రెడ్డి, దొండపాటి నాగ సత్యనారాయణ మూర్తి, శీలం రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# శివభక్తుల జయజయధ్వానాలతో సాగిన మహా శోభాయాత్ర

**శివనామస్మరణతో మారుమోగిన నగరం - అంగరంగ వైభవంగా శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి నూతన శివలింగ విగ్రహ శోభాయాత్ర**
**కోలాటాలు, అఘోర నృత్యాలు, మేళతాళాలతో ఆధ్యాత్మిక సందడి - ఊరేగింపును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**
**4వ తేదీ నుంచి 9 వరకు వైదిక క్రతువులు - 8న పునఃప్రతిష్ఠ - 9న మహా కుంభాభిషేకం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "ఓం నమః శివాయ" నినాదాలతో రాజమహేంద్రవరం నగరం భక్తిరసంలో మునిగిపోయింది. జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న నూతన శివలింగ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన భవ్య శోభాయాత్ర అపూర్వ ఆధ్యాత్మిక వైభవంతో, వేలాది మంది శివభక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. దండి మార్చ్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ మహా శోభాయాత్ర జక్కంపూడి విగ్రహం జంక్షన్, దేవి చౌక్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, గణేష్ చౌక్, గాంధీ బొమ్మ జంక్షన్, సురుచి జంక్షన్, నందం గన్నిరాజు జంక్షన్ మీదుగా జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం వరకు సాగింది. మార్గమంతా శివనామస్మరణ, హరహర మహాదేవ శంకర నినాదాలు మారుమోగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, పూర్ణకుంభ స్వాగతాలు, కోలాట ప్రదర్శనలు, అఘోరాల నృత్యాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ కళారూపాలతో శోభాయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. నగర ప్రజలు అడుగడుగునా హారతులు ఇస్తూ స్వామివారికి ఘన స్వాగతం పలికారు. ఈ మహా శోభాయాత్రను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని శివలింగ విగ్రహం శిథిలావస్థకు చేరుకోవడంతో దేవస్థాన కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కంచి కామకోటి పీఠాధిపతిని సంప్రదించి వారి ఆశీర్వాదాలతో పాటు అవసరమైన అనుమతులు, దేవాదాయ శాఖ అనుమతులు పొందిన అనంతరం నూతన శివలింగ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మన సంకల్పం పవిత్రంగా ఉండి, చేసే కార్యంలో స్వార్థం లేకపోతే భగవంతుడు మనకు ఎన్నో రెట్లు తోడ్పడతాడన్నారు. శోభాయాత్ర ప్రారంభానికి ముందు వర్షం కురుస్తుండటంతో నిర్వాహకులు ఆందోళన చెందినా, "దేవుడే చూసుకుంటాడు" అనే విశ్వాసంతో ముందుకు సాగామని, అనంతరం వర్షం ఆగిపోవడం పరమేశ్వరుని అనుగ్రహానికి నిదర్శనమన్నారు. ఈ పునఃప్రతిష్ఠ కేవలం ఒక కార్యక్రమం కాదని, రాబోయే అనేక దశాబ్దాల పాటు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచే మహత్తర ఘట్టమన్నారు. ఇలాంటి అరుదైన దివ్య కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించే అదృష్టం ప్రతి ఒక్కరికీ లభించదని, అందువల్ల భక్తులందరూ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని పిలుపునిచ్చారు. దేవస్థాన అభివృద్ధికి దశాబ్దాలుగా అండగా నిలుస్తున్న దేవాంగ సామాజిక వర్గ పెద్దలకు, దేవస్థాన కమిటీ సభ్యులకు, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న దాతలకు, శివభక్తులకు ఎమ్మెల్యే వాసు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహోత్సవం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు.

**మహోత్సవాల కార్యక్రమాలు**

కాగా శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి పునఃప్రతిష్ఠ మహోత్సవాలు 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వైదిక సంప్రదాయాల ప్రకారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 4వ తేదీ సా4 గం.లకు జలాధివాసము, 5వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలనుండి క్షీరాధివాసము, 6వ తేదీ సోమవారం సాయంత్రం ధాన్యాదివాసములు, 7వ తేదీ మంగళవారం సాయంత్రం పంచశయ్యాధివాసములు, 8వ తేదీ బుధవారం ఉదయం 6.41యంత్ర స్థాపన, మూర్తి (లింగ) స్థాపన సాయంత్రం 4.30 ని.లకు శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం జరుగుతాయి. 9వ తేదీ గురువారం ఉ.6.15 ని.లకు నుండి కుంభాభిషేకము, ఉదయం 11.30 ని.లకు అన్నాభిషేకము జరుగుతాయి. ఈ మహోత్సవాలకు నగర ప్రజలు, శివభక్తులు కుటుంబ సమేతంగా హాజరై పరమేశ్వరుని కృపాకటాక్షాలు పొందాలని దేవస్థాన కమిటీ, వేద పండితులు, నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# డైట్‌లో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం సందర్శించిన డిఈవో



**బొమ్మూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాథమిక స్థాయి నుండే విద్యా విధానాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక బొమ్మూరు డైట్ కళాశాల నందు జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు రెండు రోజుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాన్ని డి ఈ వో పరిశీలించారు. సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ "సాల్ట్ "సపోర్ట్ తో సమగ్ర శిక్ష, ఐసిడిఎస్, ప్రథమ్ సంస్థల సమన్వయంతో విద్యాశాఖ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అభ్యసన సామర్థ్యాల సాధనకు వినియోగించాలన్నారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌జెడి రాజు మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య అనుసంధానం చేసినప్పుడు మాత్రమే ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందని,ఈ శిక్షణా కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా పనిచేయాలని, ప్రతి విద్యార్థి పునాది అభ్యసనం బలోపేతం అయ్యేలా బోధన జరగాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి వై.లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర పథక సంచాలకుల వారి ఉత్తర్వుల మేరకు ప్రాథమిక విద్యను ప్రీ ప్రైమరీ స్థాయి నుండి బలోపేతం చేయాలని, విద్యార్థులు ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అభ్యసన కొనసాగించాలని, అటువంటి బోధనాభ్యసన ప్రక్రియ కల్పించడం కోసం ఉపాధ్యాయులు మరియు అంగన్వాడీ సూపర్వైజర్లు టీచర్లు లలో సామర్థ్యాల మెరుగు కోసం ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతోందని అన్నారు. ఈ శిక్షణ నేడు, రేపు నాన్ రెసిడెన్సి యల్ విధానంలో నిర్వహిస్తామన్నారు.ఇప్పటికే జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ కు శిక్షణ ఇవ్వడం కోసం రాష్ట్రస్థాయిలో కేఆర్పీలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ ఎల్.చూడామణి, సాయి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శాసనసభ్యులు బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు చేతుల మీదుగా**

# తొర్రిగడ్డ ద్వారా సాగునీరు విడుదల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం అన్నదాతలను ఆదుకునేందుకు పంట పొలాలకు జలకళ తీసుకొస్తూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా సాగునీటిని విడుదల చేశారు.తొలిత పూజా కార్యక్రమాలు నిర్వహించి స్విచ్ ఆన్ చేయడం ద్వారా సాగునీటిని అధికారకంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కోరుకొండ, సీతానగరం మండలాల్లో 20వేల ఎకరాలకు కూటమి ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని అన్నారు. నియోజకవర్గంలోని అన్నదాతలు నీటి ఎద్దడితో ఇబ్బంది పడకూడదని పంటలు సాగు చేసుకునేందుకు నీరు అందించడం జరిగిందన్నారు.రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునికరణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని హామీ ఇచ్చారు.సకాలంలో నీటిని విడుదల చేసినందుకు రైతులు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి శ్రేణులు, వీర మహిళలు, కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో అన్నదాతలు పాల్గొన్నారు.

**ఎస్‌కెవిటి పాఠశాలకు**

# హరిత హారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని.. మొక్కలు నాటి పర్యావరణానికి హరిత హారం కార్యక్రమం చేపట్టడం జరిగిందని స్టేట్ బేంక్ అఫ్ ఇండియా హెచ్ ఆర్ మేనేజర్ అవసరాల విఎమ్ఎస్ రావు అన్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రస్తుతం మనం ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా మనం పర్యావరణ పరిరక్షణ చేపట్టి, మొక్కలు నాటి పెంచాలి అన్నారు. అర్బన్ ఎమ్ఈవో ఎమ్‌విఎమ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూఎస్‌బిఐ సమాజ హితమైన మంచి కార్యక్రమాన్ని తమ పాఠశాలలో నిర్వహించడం ముదావహం అన్నారు. ఈ కార్యక్రమంలో జీవ శాస్త్ర ఉపాధ్యాయిని బిబి విజయకుమారి, గణిత ఉపాధ్యాయిని పి.లతా పూర్ణిమ,డ్రాయింగ్ ఉపాధ్యాయులు డాక్టర్ పుప్పాల బాపిరాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**మిర్తిపాడులో నేడు పట్టాదార్**

# పాస్ పుస్తకాల పంపిణీ

**ఎమ్మార్వో అంకం శ్రీనివాస్**

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో ప్రభుత్వం వారు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్త కాలు ఇచ్చుటకు ఆదేశించారు. అందు నిమిత్తం మిర్తిపాడు గ్రామంలో నేడు 10 గంటలకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకములు పంపిణీ కార్యక్రమం మిర్తిపాడు గ్రామ సచివాలయం నందు జరుగుచున్నది. కావున రైతులు (పట్టాదారులు)మీ యొక్క పాత పాసు పుస్తకములు స్వాధీన పరచి రాజముద్రలతో కూడిన పాసు పుస్తకములు తీసుకొనుటకు హాజరు కావలసిందిగా సీతానగరం ఎమ్మార్వో ఏ.శ్రీనివాస్ తెలిపారు.

# సర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలి

**తహసిల్దార్ సునీత**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు స్వచ్ఛందసంఘ సభ్యులు ప్రజలు సహకరించాలని కోరుకొండ తహసీల్దార్ సునీత అన్నారు. శుక్రవారం కోరుకొండ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలపై ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండు దశాబ్దాల పైబడిన తర్వాత నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పాదదర్శకంగా నిర్వహించడానికి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛందసంఘ సభ్యులు, ప్రజలు సహకరించాలన్నారు. నెల 14వ తేదీలోపు ఓటర్ ఫారాన్ని నింపి,ప్రస్తుత కలర్ ఫోటోలు-2, ఆధార్ జిరాక్స్ ఇవ్వాలన్నారు. ఈనెల 21వ తేదీకి చెక్ లిస్ట్ తయారవుతుందని, తద్వారా ఆగస్టు నెల వరకు తప్పులు సవరణ, త్వరలో 18 సంవత్సరాల నిండుతున్న వారికి ఫారం-6 ద్వారా నూతన ఓటు నమోదు, ఫారం-8 ద్వారా ఓటు వివిధ గ్రామాల్లోకి మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించడంతో పాటు తమకు సంబంధించిన ఓటర్లు అందుబాటులో లేకపోతే వారి వివరాలు సంబంధిత అధికారులకు తెలియజేయా లన్నారు. ఈ కార్యక్రమానికి ఏఎన్ఎంలు, ఆశ, అంగన్వాడి, ఉపాధిహామీ జి రాం జీ ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని కోరారు.

# ఏపీ ఎన్నార్టీ కో-ఆర్డినేటర్లుగా పెందుర్తి సన్నిహితులు

**అభిరామ్, నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన (ఏపీ ఎన్నార్టీ) కో-ఆర్డినేటర్లుగా రాజానగరం నియోజకవర్గ టీడీపి యువనాయకుడు పెందుర్తి అభిరామ్ సన్నిహితులు ఎంపిక కావడం పట్ల అభిరామ్ హర్షం వ్యక్తం చేశారు. సింగపూర్ రీజినల్ కో-ఆర్డినేటర్లుగా మద్దుకూరి సర్వేశ్వరరావు, కన్నెగంటి రేణుకుమార్, ఆస్ట్రేలియా కో-ఆర్డినేటర్ సంతోష్ కుమార్ ఎంపికయ్యారని అభిరామ్ తెలియజేస్తూ, హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ఎన్నార్టీ కో-ఆర్డినేటర్లుగా ఎంపిక చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన సీఎం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ "పెందుర్తి వెంకటేష్"కు, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి "కొండపల్లి శ్రీనివాస్"కు,ఏపీఎన్నార్టీ సొసైటీ ప్రెసిడెంట్ "రవి కుమార్ వేమూరు" కు నూతనంగా నియమితులైన వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తమ సన్నిహితుల సేవలను గుర్తించి,అరుదైన అవకాశం కల్పించిన రాష్ట్ర విద్యాశాఖమంత్రి "నారా లోకేష్"కు పెందుర్తి అభిరామ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ,ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి అభిరామ్, నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్నార్టీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర సబార్డినేట్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వెలగపూడి అసెంబ్లీలో శుక్రవారం రాష్ట్ర సభార్డినేట్ కమిటీ సమావే శం రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమి టీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలకు చెందిన పలు జీవోలపై కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, అసిస్టెంట్ సెక్రటరీ విశ్వనాథంతో పాటు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**ద్వారపూడి సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు**

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం ద్వారపూడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా నేడు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ రాజమండ్రి రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఈ సందర్భంగా 11 కేవీ ద్వారపూడి ఫీడర్, 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని ద్వారపూడి, వేములపల్లి, జెడ్ మేడపాడు గ్రామాలతో పాటు సంబంధిత పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

# అంగర పీర్ల పంజా భవనం పునర్నిర్మాణ శంకుస్థాపన



**కపిలేశ్వరపురం మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో మత సామరస్యానికి ప్రతికగా నిలిచిన పూర్వకాలం నుండి ఉన్న పీర్ల పంజా భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడ నూతన భవనాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా అంగర గ్రామంలో పీర్ల పంజా శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముతవల్లి షేక్ లాల్ వలి సుభాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హిందూ ముస్లింలు తమ ఆచార ప్రకారం పీర్లపంజ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష ప్రార్థనలు చేశారు. అంగర మసీదు ఇమామ్ ప్రార్థనలు చేశారు. త్వరితగతంగా నిర్మాణం పూర్తి చేస్తామని ఎల్ వి సుభాన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా, షేక్ సలీం షేక్ దరియా, షేక్ మస్తాన్, అబ్బాస్ హుస్సేన్, పెద్దింశెట్టి రాంబాబు, వైస్ చైర్మన్ ఎర్ర వీరన్న బాబు, మోటిపల్లి బాబులు తదితరులు పాల్గొన్నారు.



### పవన్ కల్యాణ్ సూపర్ హిట్ సినిమాలో ఛాన్స్..

# ఆ ఒక్క కారణంతో రిజెక్ట్ చేసిన నాగదుర్గ



తెలంగాణ ఫోక్ సింగర్ కమ్ డ్యాన్సర్ నాగదుర్గ హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనుంది. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతోన్న ఇడుపు కాయితం సినిమాలో కథానాయికగా కనిపించనుందీ అందాల తార. అయితే దీనికంటే ముందు నాగదుర్గకు పలువురి స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు వచ్చాయి. నాగదుర్గ.. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అమ్మడి గురించి తెగ వినిపిస్తోంది. సోషల్ మీడియాలోనూ ఈ ఫోక్ సింగర్ పేరు తెగ మార్మోగుతోంది. ఇప్పటివరకు తన ఫోక్ సాంగ్స్, డ్యాన్సులతో యూట్యూబ్ ను షేక్ చేసిన నాగ దుర్గ ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పైనా మెరవనుంది. ఇప్పటికే తెలుగులో కలివి వనం అనే సినిమాలో నటించిందీ బ్యూటిఫుల్ సింగర్. అలాగే తమిళంలో ధనుష్ మేనల్లుడి సరసన 'లవ్ ఓ లవ్' అనే సినిమా చేస్తోంది.. అయితే ఇప్పుడు హీరోయిన్ గా ఫుల్ లెంగ్త్ రోల్ లో కనిపించనుంది నాగ దుర్గ. బలగం ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా ఇడుపు కాయితం సినిమాలో హీరోయిన్ గా ఎంపికైంది నాగ దుర్గ. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దొండపాటి వంశీరెడ్డి దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఈ సినిమాలో నాగ దుర్గ 'శ్రీలత' అనే తెలంగాణ పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. దీనికి తోడు ఇడుపు కాయితం అనే టైటిల్ పై నెట్టింట విపరీతమైన చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో నాగదుర్గ నేపథ్యం, ఆమె పాటలు, డ్యాన్స్ లు, పాత ఇంటర్వ్యూలు కూడా నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కాగా నాగదుర్గకు గతంలోనే పలు సినిమా ఛాన్స్ లు వచ్చాయి. అయితే వివిధ కారణాలతో వాటిని రిజెక్ట్ చేసింది. 'హీరోయిన్‌గా నటించకముందే నాకు చాలా మంచి ఆఫర్లు వచ్చాయి. నాని హీరోగా నటించిన 'శ్యామ్ సింగరాయ్' సినిమాలో సాయి పల్లవి పాత్రకు సహచరిగా క్లాసికల్ టచ్ ఉన్న ఓ ముఖ్యమైన పాత్ర కోసం నన్ను అడిగారు. అలాగే 'అశోకవనంలో అర్జున కళ్యాణం' సినిమాలో కూడా ఛాన్స్ వచ్చింది. పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన 'బ్రో' సినిమాలో సిస్టర్ క్యారెక్టర్ కోసం కూడా సంప్రదించారు. సినిమాలతో పాటు పలు టీవీ సీరియల్స్‌లో నటించే అవకాశాలు కూడా వచ్చాయి. అయితే ఆ సమయంలో నా ఫోకస్ పూర్తిగా నాట్యంపైనే ఉండేది. ముఖ్యంగా కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ సాధించాలన్నది నా కల. అందుకే సినిమాల్లోకి వెంటనే రావాలని అనుకోలేదు. నాట్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో వచ్చిన ఈ సినిమా ఆఫర్లను వదులుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు మంచి కథ, మంచి పాత్ర దొరికిందని భావించి సినిమాల్లోకి అడుగుపెట్టాను' అని నాగదుర్గ చెప్పుకొచ్చింది.

### ఆ సినిమాతో కెరీర్ పీక్స్.. కానీ ఒక్క ఘటనతో

# నా జీవితమే మారిపోయింది.. నభా నటేష్..




ప్రస్తుతం హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో ఫుల్ ఫాంలో ఉన్న హీరోయిన్ నభా నటేష్. ఇటీవల ఓ ఇంటర్వ్యూ తన కెరీర్‌లో రెండేళ్ల సుదీర్ఘ విరామం గురించి వివరించారు. మెట్లపై నుంచి జారిపడి భుజం ఎముకలు విరిగిపోవడంతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఈ గాయం నుండి కోలుకోవడానికి సమయం పట్టిందని, అది తనను వ్యక్తిగతంగా మరింత బలోపేతం చేసిందని నభా పేర్కొన్నారు. నాగబంధం వంటి చిత్రాలతో మళ్లీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నానని ఆమె వెల్లడించారు. హీరోయిన్ నభా నటేష్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి కాంబోలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీ తర్వాత ఆమెకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. కానీ అదే సమయంలో అనుహ్యంగా సినిమాలకు దూరమయ్యింది. తాజాగా నభా నటేష్ తన కెరీర్‌లో ఎదురైన సవాళ్లు, ముఖ్యంగా రెండేళ్ల సుదీర్ఘ విరామం గురించి ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన సినీ ప్రస్థానం, వ్యక్తిగత జీవితం, భవిష్యత్ ప్రణాళికల గురించి ఆమె వివరించారు. 2015లో కన్నడ చిత్రంతో తన సినీ కెరీర్‌ను ప్రారంభించిన నభా నటేష్, ఆ తర్వాత తెలుగులో నన్ను దోచుకుందువటే చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇస్మార్ట్ శంకర్, వజ్రకాయ వంటి చిత్రాలతో మాస్, యూత్, క్లాస్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తన కెరీర్ పట్ల ఎప్పుడూ ఒక భిన్నమైన ఆలోచనతో ఉంటానని నభా తెలిపారు. సినిమా అంటే కేవలం వృత్తి కాదని, అది తనకొక సృజనాత్మక, ఆధ్యాత్మిక అనుభూతి అని ఆమె అన్నారు. చిన్నప్పటి నుంచి సినిమాలు చూడటం అంటే తనకి చాలా ఇష్టమని, అందుకే నటిగా ప్రతి సినిమాలో కొత్త అనుభవం కోరుకుంటానని పేర్కొన్నారు. ర్యాట్ రేస్‌లో భాగంగా సినిమాలు చేయకుండా, తనకు ఆనందం, సంతృప్తినిచ్చే పాత్రల కోసం ఎదురు చూస్తానని నభా వెల్లడించారు. ఈ మధ్యకాలంలో రెండేళ్ల పాటు సినిమాల నుంచి దూరంగా ఉండాల్సి వచ్చిందని, అందుకు గల కారణాన్ని వివరిస్తూ, "నేను మెట్లపై నుంచి జారిపడ్డాను. తలకి దెబ్బ తగలకుండా చూసుకునే ప్రయత్నంలో, నా శరీర బరువు మొత్తం ఎడమ భుజంపై పడింది. లోపల ఉన్న ఎముకలు చిన్న చిన్న ముక్కలైపోయాయి. అప్పుడు నేను ఫ్రాక్చర్ అనుకున్నాను, కానీ సర్జరీ చేయాల్సి వచ్చింది. స్టీల్ రాడ్ , అనేక స్క్రూలు పెట్టారు," అని వివరించారు. ఈ సంఘటన తనను శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా చాలా ప్రభావితం చేసిందని, ఆ సమయంలో దాదాపు 4-5 సినిమాలు చేస్తున్నానని ఆమె తెలిపారు.

# సైలెంట్‌గా శ్రీలంకను ఉతికేస్తున్న సాయి సుదర్శన్, పడిక్కల్!




శ్రీలంక 'ఏ'తో రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఏ' బలమైన స్థితిలో నిలిచింది. సాయి సుదర్శన్ అజేయ సెంచరీ, దేవదత్ పడిక్కల్ అజేయ 94 పరుగులతో రెండో వికెట్‌కు 181 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 247/1తో నిలిచి 119 పరుగుల వెనుకబడి ఉంది. క్రికెట్ అభిమానులంతా ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌పై ఫోకస్ పెడితే, మరోవైపు శ్రీలంకపై మన కుర్రాళ్లు ఇరగదీస్తున్నారు. ముఖ్యంగా సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ అయితే లంకను ఓ ఆట ఆడుకుంటున్నారు. శ్రీలంక 'ఏ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఏ' జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి పటిష్ట స్థితిలో నిలిచింది. గాలే వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ అజేయ సెంచరీతో మెరవగా, దేవదత్ పడిక్కల్ 94 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును బలమైన స్థితికి చేర్చాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు అజేయంగా 181 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 247/1 స్కోరు చేసింది. ప్రస్తుతం శ్రీలంక 'ఏ' తొలి ఇన్నింగ్స్ స్కోరుతో పోలిస్తే భారత్ ఇంకా 119 పరుగులు వెనుకబడి ఉంది. రెండో రోజు ఉదయం 288/5 స్కోరుతో ఆట ప్రారంభించిన శ్రీలంక 'ఏ' మరో 78 పరుగులు మాత్రమే జోడించి 366 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ సహన్ అరచ్చిగే అద్భుతంగా బ్యాటింగ్ చేసి 127 పరుగులు సాధించాడు. అయితే భారత బౌలర్లు చివరి దశలో అద్భుతంగా పుంజుకుని ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు. భారత్ తరఫున గుర్నూర్ బ్రార్, సరాంశ్ జైన్ తలో నాలుగు వికెట్లు పడగొట్టి శ్రీలంకను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. చివరి మూడు వికెట్లు కేవలం 12 బంతుల వ్యవధిలోనే కోల్పోవడం శ్రీలంకకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 'ఏ'కు ఓపెనర్లు శుభారంభం అందించారు. అమన్ మోఖాడే 66 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం అనంతరం అవుట్ అయినప్పటికీ, ఆ తర్వాత సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ ఇన్నింగ్స్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇద్దరూ ఓపికగా ఆడుతూ చెడు బంతులను బౌండరీలకు తరలించారు. టీ విరామ సమయానికి భారత్ 111/1తో నిలిచింది. చివరి సెషన్‌లో శ్రీలంక బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఈ జోడీ ఆధిపత్యం చెలాయించింది. సాయి సుదర్శన్ 30వ ఓవర్‌లో అర్ధ సెంచరీ పూర్తి చేసి, 56వ ఓవర్‌లో అద్భుత సెంచరీ నమోదు చేశాడు. అతడు 104 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరోవైపు దేవదత్ పడిక్కల్ కూడా అద్భుత బ్యాటింగ్‌తో 94 పరుగుల వద్ద నాటౌట్‌గా నిలిచి సెంచరీకి చేరువలో ఉన్నాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'ఏ' 247/1 స్కోరుతో నిలిచి, కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయింది. సుదర్శన్-పడిక్కల్ జోడీ మూడో రోజు కూడా ఇదే జోరు కొనసాగిస్తే భారత్ 'ఏ' భారీ ఆధిక్యం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఫుట్‌బాల్ హిస్టరీలో సరికొత్త చరిత్ర..

## 36 ఏళ్ల నాటి వరల్డ్ కప్ రికార్డును బద్దలు కొట్టిన స్పెయిన్ గోల్‌కీపర్




ఫిఫా వరల్డ్ కప్ 2026లో స్పెయిన్ గోల్‌కీపర్ ఉనై సిమోన్ వరుసగా 519 నిమిషాలు గోల్ ఇవ్వకుండా 36 ఏళ్ల ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఆస్ట్రియాపై విజయంతో స్పెయిన్ ప్రీక్వార్టర్స్‌కు చేరగా సిమోన్ చరిత్ర సృష్టించాడు. ఫిఫా వరల్డ్ కప్ 2026 రౌండ్ ఆఫ్ 32 పోరులో ఆస్ట్రియాపై 3-0తో ఘన విజయం సాధించిన స్పెయిన్ జట్టు ప్రీ-క్వార్టర్ ఫైనల్ టికెట్‌ను ఖరారు చేసుకోవడమే కాకుండా, ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అద్భుతమైన మైలురాయిని అందుకుంది. స్పెయిన్ జట్టుకు చెందిన 29 ఏళ్ల స్టార్ గోల్‌కీపర్ ఉనై సిమోన్ వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ కాలం పాటు ప్రత్యర్థి జట్టుకు ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించాడు. ఈ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ క్లీన్ షీట్ నమోదు చేయడం ద్వారా ఎథ్లెటిక్ బిల్బావో క్లబ్‌కు ఆడే ఈ నమ్మకమైన కీపర్ తన పేరును చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు. గత ప్రపంచకప్‌తో పాటు ప్రస్తుత వరల్డ్ కప్ మ్యాచ్‌లను కలిపి ఉనై సిమోన్ మైదానంలో వరుసగా 519 నిమిషాల పాటు ప్రత్యర్థులకు చిక్కకుండా అజేయంగా నిలిచాడు. ఈ అద్భుత ప్రదర్శనతో ఆయన ఇటలీకి చెందిన గ్రేట్ గోల్‌కీపర్ వాల్టర్ జెంగా 1990లో నెలకొల్పిన 36 ఏళ్ల నాటి రికార్డును అధిగమించాడు. వాల్టర్ జెంగా తన సొంత దేశంలో జరిగిన వరల్డ్ కప్‌లో వరుసగా 517 నిమిషాల పాటు గోల్ కాకుండా అడ్డుకుని ఐదు క్లీన్ షీట్లు సాధించాడు. ఇప్పుడు సిమోన్ ఆ రికార్డును దాటేశాడు. అంతేకాదు, ఆస్ట్రియాపై జరిగిన మ్యాచ్ రెండో హాఫ్‌లో సిమోన్ స్పెయిన్ దేశపు బెస్ట్ గోల్‌కీపర్ ఇకర్ కాసియాస్ పేరిట ఉన్న జాతీయ రికార్డును కూడా బద్దలు కొట్టాడు. కాసియాస్ 2010, 2014 ప్రపంచకప్‌లలో స్పెయిన్ తరఫున సుదీర్ఘ కాలం క్లీన్ షీట్ సాధించిన కీపర్‌గా రికార్డుల్లో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. స్పెయిన్ డిఫెన్స్ ఎంత బలంగా ఉందంటే, ఆస్ట్రియా ఆటగాళ్లు మ్యాచ్ మొత్తం మీద స్పెయిన్ గోల్ పోస్ట్ వైపు ఒక్కటంటే ఒక్క షాట్ ఆన్ టార్గెట్ కూడా కొట్టలేకపోయారు. దీనివల్ల గోల్‌కీపర్ ఉనై సిమోన్‌కు ఈ మ్యాచ్‌లో కనీసం ఒక్క సేవ్ చేయాల్సిన అవసరం కూడా రాలేదు. ఈ టోర్నమెంట్ మొత్తంలో స్పెయిన్ జట్టుపై ప్రత్యర్థి జట్లు కేవలం 4 సార్లు మాత్రమే ఖచ్చితమైన షాట్లు కొట్టగలిగాయంటే స్పెయిన్ రక్షణ శ్రేణి ఎంత పటిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సిమోన్ మైదానంలో పెద్దగా హడావుడి చేయకపోయినా, జట్టును గెలిపించే విషయంలో వెనుక ఉండి నడిపించే ఒక అభేద్యమైన గోడలా మారాడు. ప్రస్తుతం స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టులో గోల్‌కీపర్ స్థానం కోసం పోటీ ఏ స్థాయిలో ఉందో చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. ఐరోపాలోని టాప్ క్లబ్స్‌కు ఆడి కప్పులు గెలిచిన ఇద్దరు ప్రపంచ స్థాయి బెస్ట్ కీపర్లు ఉనై సిమోన్ ఫామ్ కారణంగా మ్యాచ్ అంతా బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తోంది. ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్సెనల్ క్లబ్ తరఫున వరుసగా మూడు సార్లు గోల్డెన్ గ్లవ్ అవార్డు గెలుచుకుని, ఈ ఏడాది ఆ జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టిన డేవిడ్ రాయా ప్రస్తుతం స్పెయిన్ జట్టులో రిజర్వ్ కీపర్‌గా ఉన్నాడు. అలాగే బార్సిలోనా క్లబ్‌కు ఆడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ యువ కీపర్‌గా పేరు తెచ్చుకున్న గార్సియా కూడా కేవలం బెంచ్ మీద కూర్చుని మ్యాచ్ చూడాల్సి వస్తోంది. ఇంతటి దిగ్గజాలు జట్టులో ఉన్నప్పటికీ, స్పెయిన్ కోచ్ లుయిస్ డి లా ఫ్యూయెంటె మాత్రం ఉనై సిమోన్‌పైనే తన పూర్తి నమ్మకాన్ని ఉంచారు, ఆ నమ్మకాన్ని సిమోన్ నిలబెట్టుకున్నాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com